# పుస్తకపరిచయాలు

2015



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 147

# కౌముది 2015 సంచికలలో ప్రచురితమైన పుస్తక పరిచయాలు


| పుస్తకం పేరు | రచయిత(త్రి) | పేజి |
|---|---|---|
| ఘర్షణ | అపర్ణ మునుకుట్ల గునుపూడి | 2 |
| దర్దీ | షాజహానా కవిత్వం | 3 |
| హాస్య నాటికలు | శంకరమంచి పార్థసారథి | 4 |
| పాముల పుట్టల్లో చట్ట సభలు | ఎస్ గణపతిరావు | 5 |
| అమెరికా తెలుగు కథ సాహిత్యం | వంగూరి చిట్టెన్ రాజు  తన్నీరు కళ్యాణ్ కుమార్ | 6 |
| ఎగిరే పావురమా | కోసూరి ఉమాభారతి | 7 |
| బలభద్రపాత్రుని రమణి కథలు – 2 | బలభద్రపాత్రుని రమణి | 8 |
| తోటమాలి | డా వ్యాకరణం అచ్యుత రామారావు | 9 |
| పుట్టిల్లు | డా కె వి రమణ రావు | 10 |
| హస్యాహస్య కథలు | డా గాయత్రీదేవి | 11 |
| తెలుగు వచన శైలి | డా యు ఎ నరసింహ మూర్తి | 12 |
| మొదటి తరం రాయల సీమ కథలు | డా అప్పిరెడ్డి హరినాధరెడ్డి | 13 |
| సత్యం శివం సుందరం | సత్యం మందపాటి | 14 |
| 6 ఎలిమెంట్ | ముప్వాశ్రీనివాస రావు | 15 |
| క్రాంతి గీతాలు | డా ఆవంత్స సోమసుందర్ | 16 |
| కవిత | అలిశెట్టి ప్రభాకర్ | 17 |
| జీవన సమరం | డా. రావూరి భరద్వాజ | 18 |
| శ్రీ మహాభారతం | ఆచార్య యార్లగడ్డ బాలగంగాధర రావు | 19 |

| | | |
|---|---|---|
| కథాయణం | అనిల్ ఎస్ రాయల్ | 20 |
| ఎవరు ఎలా మాట్లాడతారు? | ఉషశ్రీ | 21 |
| నాగరికథ | అనిల్ ఎస్ రాయల్ | 22 |
| మాస్టారి కథానికలు | ఉదయబాబు | 23 |
| అజరామరం | ఎమ్వీ రామిరెడ్డి | 24 |
| మంత్రలిపి | మంత్రలిపి | 25 |




**Published by:**
**Vanguri Foundation of America**
PO Box 1948
Stafford, TX 77497
Phone: 832 594 9054

**Writer:**
agunupudi@gmail.com

**అమెరికా,** కాలిఫోర్నియాలోని బే ఏరియా రచయిత్రి శ్రీమతి అపర్ణ మునుకుట్ల గునుపూడిగారు వ్రాసిన కథసంపుటి ' ఘర్షణ'. ఈ పుస్తకానికి ముందుమాట వ్రాస్తూ గొల్లపూడి మారుతిరావుగారు "అమెరికా ఊబిలో తలమునకలయి, అదే వైకుంఠమనుకున్నవారు కొందరూ, అందులోంచి బయటపడాలనుకున్నా సాధ్యంకాని నిస్సహాయులు కొందరూ, ఎందుకు బయటపడాలో తెలియని వారు కొందరూ, అసలు బయటపడాలనే ఆలోచనే లేనివారు కొందరూ - ఇలాంటి అవ్యవస్థ నేపథ్యంలో ఆ ఊబిలోకి దిగకుండా పక్కన నిలబడి గమనించి, గుర్తుపట్టడానికి చిన్నపాటి ఒడ్డుని మిగుల్చుకున్న అదృష్టవంతురాలు అపర్ణ" అన్నారు. ఈ పుస్తకంలోని కథలు చదివిన పాఠకులందరూ గొల్లపూడిగారి వ్యాఖ్యతో ఏకీభవిస్తారు. ఇందులోని కథాంశాల్లో అధికశాతం ప్రాక్పశ్చిమాల సంప్రదాయాలనీ, అలవాట్లనీ సమదృష్టితో బేరీజు వేసినట్లుంటాయి. దాదాపు పదేళ్ళక్రిందట 'సుజనరంజని' మాసపత్రికలో 'అర్థం-అంతరార్థం' అనే శీర్షికతో అపర్ణగారు ధారావాహికంగా కథలు వ్రాశారు. వాటినీ, మరికొన్ని స్వీయరచనలనీ కలిపి ఈ 'ఘర్షణ' కథా సంపుటిని ప్రచురించారు. ఇందులోని ప్రతి కథవెనుకా ఒక ఆలోచన ఉంది, ఒక విశ్లేషణ ఉంది, ఒక ప్రయోజనమూ ఉంది. ఐతే ఇలా ఒక ప్రయోజనాన్ని ఆశించి వ్రాసే రచనలకు ఒక ఇబ్బంది కూడా ఉంటుంది. ఎలా అంటే - సరైన సన్నివేశాలని, భాషనీ ఎన్నుకోకపోతే అదొక వ్యాసంలాగానో, వార్తాపత్రిక కథనంలాగానో తయారయ్యే ప్రమాదం ఉంది. అలా కాకుండా కథగానే కనిపిస్తూ పాఠకులకి ఒక సందేశం అందించాలంటే రచయిత్రికి ఎంతో నేర్పు కావాలి. అలాంటి నేర్పుని అలవోకగా సొంతం చేసుకున్న రచయిత్రి అపర్ణగారు. ఇందులోని చాలా కథల్లో ఇప్పటికి కనుమరుగైన అలనాటి జీవనవిధానాల్లోని అమాయకత్వమూ, అమాయకత్వం వెనుకనున్న ప్రయోజకత్వమూ కనిపిస్తాయి. చాలాసార్లు ఆధునిక జీవన శైలిని పురాతన సంప్రదాయాలతో పోల్చి, సరళమైన జీవితానికి చక్కటి మార్గాలు చెప్పీ చెప్పకుండా చెప్పడం రచయిత్రి ప్రత్యేకతగా కనిపిస్తుంది. ఈ కథలన్నీ కాలక్షేపం కోసం చదివి వదిలేసేవి కాదు - ఆలోచింపచేస్తాయి, ఒక్కోసారి ఆచరింపచేస్తాయి, పదిమందితో పంచుకోవాలనిపిస్తాయి. రచయిత్రి కలం నుంచి ఇటువంటి ప్రయోజనాత్మక కథలు మరిన్ని రావాలని ఆశిద్దాం.

***




**Writer:**
**10-1-639 Chintal Basti**
Khairatabad
Hyderabad – 500 004
shajahana74@gmail.com

**ఆధునిక** కవయిత్రులలో సొంతగొంతుక, సొంతసంతకం ఉన్న కవయిత్రి డా.షాజహానా. ఈ కవితాసంపుటి శీర్షిక ‘దర్దీ‘ కి తగినట్లే ఇందులోని కవితలన్నీ జీవితంలోని ఎన్నో బాధల కోణాలకీ, ఎన్నో కోణాల్లోని బాధలకీ ప్రతిరూపాలు. షాజహానాగారి భావాలు ఎంత తీవ్రంగా ఉంటాయో కవితా శైలీ అంత బలంగా ఉంటుంది. ఒక్కో పదం వేనవేల డైనమైట్ల శక్తిని నింపుకున్నట్లుంటుంది. ఏ కవితా అలవోకగా వ్రాసినట్లుండదు. ప్రతి కవితా ప్రజ్వలించే అగ్నికీలల వేడిని తలపిస్తుంది. ఖండాంతరంలో ఉన్న అక్కని గుర్తు చేసుకుంటూ ‘ముప్ఫయ్యేళ్ళకే మూడు సిజేరియన్లయి / నువ్వెంత నరకయాతన ననుభవించావో / నాకు అవసరం లేకున్నా వళ్ళంతా / ఆక్యుపంక్చర్ చేసినట్లుంటుంది....పాత జ్ఞాపకాలన్నింటినీ పేర్చి / మనసు బొంతమీద పడుకున్నాను.. / వాంతి చేసుకున్నాక నీ వొళ్ళో సేదదీరినట్లుంటుంది‘ అంటారు. సిద్దార్థి అనే కవితలో ‘యాసిడ్లు, కత్తులు, కిడ్నాపులై అహంకారం / జీవితాల్ని మింగేస్తుంటే / బతుకుల్ని మృత్యువుకేసి రాకేస్తున్న నీ కర్కశం ముందు / ఇంకే పశుజాతైనా నయమేననిపిస్తుంది / వత్తివత్తి పండును చేయాలనే మెదళ్ళ ముందు / లేత మనసులు మాడిమసైపోతున్నాయి‘ అంటారు. హైదరాబాదుని కాంక్రీటు జంగిల్ చేసిన వాళ్ళని "ఉన్న నాలుగు పచ్చని తలల్ని తెగనరికి / బిల్డింగులు కట్టిందెవరు? / రోడ్లని వాహనాల ప్రావాహం చేస్తూ / కాలుష్యమని గగ్గోలెత్తడమేంటి?" అని ప్రశ్నిస్తారు. ప్రత్యేక సందర్భాలకో, సంఘటనలకో స్పందించి వ్రాసిన కవితలని కూడా అందరి హృదయాలని తాకేలా వ్రాయడం షాజహానాగారి ప్రత్యేకత. ఫ్రాంక్‌ఫర్ట్‌లో తనకి ఆశ్రయమిచ్చిన స్నేహితురాలిగురించి వ్రాసిన కవితలో "దేశాలు దాటి, నదులు, సముద్రాలు దాటి వెళ్ళినా / వెంటాడిన ఒక కన్నీటి పడగ / దుఃఖం ఎంతదూరం వెళ్ళినా / వెంటే వస్తుంది...వెంటాడుతుంది" అంటారు. ఇందులోని కవితలన్నీ సీరియస్‌గా చదవాల్సిన కవితలు, చదివి ఆలోచించాల్సిన కవితలు. ఈ కవితలు మనసుల్ని సున్నితంగా తాకే కవితలు కాదు – ఆలోచనల వేడిని రగిల్చే కవితలు.

***




*Writer:*
**Sankaramanchi Parthasaradhi**
301, Saisudha Residency
Viveknagar, Chikkadapally
Hyderabad – 500 020
Phone: 90009 17274

**కథ, నవల, నాటిక, నాటకం..**వీటిల్లో దేని రచనా శైలి దానిదే. కథలు వ్రాసే వాళ్ళకి నవల రాయడం కష్టం కావొచ్చు, ఈ రెండూ వ్రాసిన వాళ్ళకి నాటికా రచనలో పట్టు లేకపోవచ్చు. వీటిన్నంటిలో తమనితాము నిరూపించుకున్న రచయితలు తెలుగులో తక్కువగానే ఉన్నారని చెప్పుకోవచ్చు. ఈ ప్రక్రియలన్నింటిలో అనుభవాన్ని, గుర్తింపుని తెచ్చుకున్న రచయిత శ్రీ శంకరమంచి పార్థసారథిగారు. పుంఖానుపుంఖాలుగా రచనలు చేయకపోయినా వాసిగల రచనలు చేసిన/చేస్తున్న రచయితగా గుర్తింపు ఉన్న వ్యక్తి పార్థసారథిగారు. రంగస్థలం మీద తెలుగునాటకం ఎన్ని ఇక్కట్లకు గురౌతోందో వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇలాంటి పరిస్థితుల్లోనూ తెలుగు నాటకాన్ని బ్రతికించడానికి తమవంతు ప్రయత్నం చేస్తున్న రచయితల్లో పార్థసారథిగారు కూడా ఒకరు. రంగస్థలప్రదర్శనకోసం వ్రాసిన నాటికలు, ముఖ్యంగా హాస్యనాటికలు - పార్థసారథిగారు వ్రాసినన్ని మిగతా రచయితలెక్కువమంది వ్రాయలేదేమో. ఒక విధంగా హాస్యనాటికల స్పెషలిస్ట్ అని చెప్పుకోవచ్చు పార్థసారథిగారిని. గత మూడు దశాబ్దాలు పైగా వీరి హాస్యనాటికలు తెలుగు రంగస్థలం మీద తమదైన గుర్తింపుని తెచ్చుకున్నాయి. వందలాది ప్రదర్శనలిచ్చిన 'దొంగలబండి' రచయిత పార్థసారథిగారే. వారు వ్రాసిన పది హాస్యనాటికల సంపుటి ఈ పుస్తకం. అన్నీ హాస్యరస ప్రధానమైనవీ, ఇప్పటికే రంగస్థలం మీద పలు ప్రదర్శనలకినోచుకున్నవి ఈ నాటికలన్నీ. పాఠకులుగా చదవడానికి కూడా సరళంగా ఉన్నాయి. అక్కడక్కడా నటనాపరమైన సూచనలు ఉన్నా, అవి పరిమితంగానే ఉండడం వల్ల ఓ కథలా చదవడానికీ, చదివి ఆనందించడానికీ అనువుగా ఉన్నాయి ! ఈ నాటికలన్నీ తక్కువ పాత్రలతో ప్రవాసతెలుగు సంస్థల ప్రదర్శనలకి కూడా చాలా అనుకూలంగా ఉన్నాయి. ఒక వైపు సంభాషణా హాస్యాన్ని, ఇంకో వైపు సన్నివేశ హాస్యాన్ని కూడా అతి సమర్థవంతంగా నడిపించగల సవ్యసాచి పార్థసారథి గారు. ఈ నాటికల్లోని పలు సన్నివేశాలు వివిధ చలనచిత్రాల్లో కూడా చోటుచేసుకున్నాయి. అందులో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది - 'సైలెన్స్ ప్లీజ్...' నాటికలో సంభాషణలు లేని దొంగపాత్ర. ఈ సన్నివేశాన్ని 'వినోదం' చిత్రంలో యథాతథంగా వాడినప్పుడు ఆ దొంగపాత్రపోషించిన బ్రహ్మానందానికి నంది ఆవార్డ్ కూడా వచ్చింది. పార్థసారథిగారు సృష్టించిన సన్నివేశాలు, పాత్రలు అంత బలమైనవి. సినీరచయితగా కూడా తన హాస్యరచనా శైలిని నిరూపించుకుంటున్న పార్థసారథిగారి కలం నుంచి మరిన్ని హాస్యనాటికలు రావాలని ఆశిద్దాం.

***




*Publishers:*
**S.Ganapati Rao**
D-1 , Power Apartments
109, Kodambakkam High Road
T – Nagar
Chennai – 600 017

**ఇప్పటికే** 'మరిగే తారుసరోవరం','నిప్పుల తుఫాన్',' ఇంటిమీద దుప్పటి' కథా సంకలనాలతో తానేమిటో నిరూపించుకున్న రచయిత ఎస్.గణపతిరావు గారు. దేశంలో అవినీతి మితిమీరిపోతోంది, రాజకీయాలు సకల కల్మషాలతో కలుషితమై ఉన్నాయి, సామాన్యుడి జీవితం కత్తుల వంతెనమీద ప్రయాణంలా ఐపోతోంది.. ఇలాంటి పరిస్థితుల్లో 'ఏం చెయ్యాలా' అని గోళ్ళు కొరుక్కోవడమో, 'మనసులోని భావాలు ఎలా వ్యక్తపరచాలా' అని నీళ్ళు నమలడమో, 'మనకెందుకులే' అని పక్కకి తొలగడమో - ఇవి సమస్యకి పరిష్కారం కాదు అని కలంగొంతెత్తి నినదించి తనదైన శైలిలో పదాల తూటాలతో, వాక్యాల గ్రెనేడ్లతో అవిశ్రాంతంగా పరిశ్రమిస్తున్న కథారచనా యోధుడు ఎస్.గణపతిరావుగారు. ఇంతకు ముందు వచ్చిన తన కథా సంపుటాల్లోలాగనే, ఈ 'పాముల పుట్టల్లో చట్టసభలు' పుస్తకంలో కూడ సమాజంలోని, మనుషుల్లోని మరికొన్ని చీకటి కోణాలపై సెర్చ్‌లైట్ వేశారు. విలక్షణమైన రచనాశైలిలో సాగిన 14 కథలు ఉన్నాయి ఈ సంపుటిలో. ప్రతి కథ రచయిత మనసులోని ఆవేశానికి ఆవేదనకి ప్రతి బింబం. పాఠకుల్ని ఆగి లోచించమని చెబుతాయి కథలన్నీ. కొన్ని కథల్లోని దృశ్యాలు సింబలిక్‌గా, యాబ్‌స్ట్రాక్ట్‌గా అనిపించినా చెప్పదలుచుకున్న సందేశంలో మాత్రం ముక్కుసూటితనం ఉంది, ఎక్కడా నాన్చుడు వ్యవహారం ఉండదు. ప్రతి కథకీ వ్రాసిన టాగ్ లైన్లు చూస్తేనే తెలుస్తుంది ఆయా కథల్లోని తీవ్రత ఎంతో - అబద్ధం, మోసం, దగా మనిషికి పర్యాయపదాలు (తిమింగలాల గానం), వేలంలో ఎన్నికలు-వ్యాపారులదే హవా (పులుల తోలు మేకలు), ప్రజల్ని బలహీనుల్ని చేసి రాజ్యం పంచుకుంటున్నారు (కత్తిమీద తేనెపట్టు), మనదంతా రాజకీయ రణరంగం శత్రువుల్ని సంహరిస్తేనే 1నందం (రాజకీయాల కందిరీగలు). నిజాయితీకోణంలోంచి పరిసరాలని పరిశీలించమని ఇందులోని ప్రతి కథ పాఠకుడ్ని హెచ్చరిస్తుంది. సమాజమూ, మనిషీ - నీతిగా, నిజాయితీగా ప్రవర్తించాల్సిన అవసరాన్ని పదేపదే ఎలుగెత్తి చాటుతుంది. అలుపులేని పోరాటపటిమతో ఇలాంటి కథల్ని అందిస్తున్న రచయిత ఎస్.గణపతిరావుగారిని అభినందించి తీరాలి.

***




*Publishers:*
**Vanguri Foundation of America**
PO Box 1948, Stafford, TX 77497

అమెరికా తెలుగుకథానికకి అర్థశతాబ్దం నిండిన సందర్భంలో వంగూరి ఫౌండేషన్ వారు ప్రచురించిన ప్రతిష్ఠాత్మక పరిశోధనా గ్రంథం ఈ 'అమెరికా తెలుగు కథాసాహిత్యం - ఒక సమగ్రపరిశీలన'. డా.తన్నీరు కళ్యాణ్ కుమార్ ఇదే పేరుతో లోగడ పిహెచ్.డి థీసిస్ సమర్పించారు. అందులోని కొన్ని అధ్యాయాలను తొలగించి, మరిన్ని కథా సంకలనాలను పరిశీలనలోకి తీసుకుని, వంగూరి చిట్టెన్ రాజు గారితో కలిసి ఈ సమగ్రగ్రంథాన్ని పాఠకుల ముందుకి తీసుకొచ్చారు. వంగూరి ఫౌండేషన్ వారి 58వ ప్రచురణ ఈ పుస్తకం. అమెరికా తెలుగు కథల గురించి ఇంతవరకూ ఇలాంటి సమగ్ర పరిచయ, విశ్లేషణా గ్రంథం రాలేదని చెప్పొచ్చు. ఐదేళ్ళ పాటు సాగిన కృషి ఫలితంగా వెలువడిన ఈ పుస్తకంలో ప్రస్తావించబడిన అంశాల పరిమితులని కూడా ముందుమాటలో చిట్టెన్ రాజుగారు స్పష్టంగా తెలియచేశారు. అమెరికా కథలని వస్తుప్రాతిపదికగా 18 రకాలుగా విభజించారు. ఉదా. అమెరికన్ సంస్కృతిపట్ల అవగాహన కలిగించే కథలు, అమెరికా హాస్యకథలు, తరాల మధ్య సంఘర్షణలను చిత్రించిన కథలు, వివాహ సమస్యలను చిత్రించిన కథలు, విభిన్న సంస్కృతుల వైవాహిక జీవిత సమస్యలను చిత్రించిన కథలు.. ఇలా. అమెరికా కథలపై ఒక అపోహ ఉంది. అమెరికాలో తెలుగురచయితలు కూడా ఎక్కువగా మాతృదేశం గురించే వ్రాస్తారు, నాస్టాల్జిక్ కథలే తప్ప అమెరికా సంస్కృతినీ, అక్కడి జీవన శైలుల్నీ ప్రతిబింబించే కథలు ఎక్కువగా రావు - అని. అది కేవలం అపోహ ననీ, అమెరికా కథల్లో కూడా విశేషమైన వస్తువైవిధ్యం ఉందనీ ఈ విశ్లేషణా గ్రంథం సోదాహరణంగా వివరిస్తుంది. చివరలో అమెరికాంధ్ర కథారచయితల కథాసంకలనాల సంక్షిప్త పరిచయం, అమెరికా కథల్లోని కథాశిల్పం గురించిన వ్యాసాలు ఈ పుస్తకానికి సమగ్రతని చేకూర్చాయని చెప్పవచ్చు. విశేషమైన కృషిచేసి, వందలాది అమెరికా తెలుగు కథలని పరిచయం చేసిన వంగూరి చిట్టెన్ రాజు, తన్నీరు కళ్యాణ్ కుమార్‌గార్లను అభినందించాలి.

***




*Publishers:*
**Vanguri Foundation of America**
PO Box 1948, Stafford, TX 77497

***Writer:*** ukosuri@hotmail.com

**హ్యూస్టన్, టెక్సాస్‌లో** గత 30 సంవత్సరాలుగా 'అర్చనా డాన్స్ అకాడెమీ' ద్వారా గణనీయమైన కళాసేవ చేస్తున్న ఉమాభారతి గారు రచయిత్రిగా కూడా పేరు తెచ్చుకుంటున్నారు. కలం పట్టిన కొద్ది రోజుల్లోనే 'విదేశీకోడలు' కథా సంపుటినీ, 'రాజీపడిన బంధం' డైరెక్ట్ నవలనీ పుస్తకరూపంలో తీసుకొచ్చారు. ఇప్పుడు ఈ 'ఎగిరే పావురమా' నవలని పాఠకులకి అందిస్తున్నారు. ఈ నవల 'సారంగ' సాహిత్య వారపత్రికలో సీరియల్‌గా వచ్చింది. గత కొన్ని దశాబ్దాలుగా అమెరికాలోనే స్థిరపడినప్పటికీ, ఇండియాలోని గ్రామీణవాతావరణాన్ని తన నవలకి నేపథ్యంగా ఎంచుకున్న రచయిత్రిని అభినందించాలి. అలానే ఆడపిల్లలకి భారతీయ సమాజంలో ఇప్పటికీ జరుగుతున్న అన్యాయాలనీ, లింగవివక్షతనీ రచనలో చూపించాలనుకున్నప్పుడు ఒక అట్టడుగు బాలిక జీవితాన్ని అందుకు ప్రతీకగా ఎంచుకోవడంలో కూడా ఉమాభారతిగారు ఒక సాహసం చేశారని చెప్పవచ్చు. అందునా ఇందులోని ముఖ్యపాత్రని వికలాంగురాలిగా తీసుకోవడం రచయిత్రికి మరో పెద్ద సవాల్. అలాంటి పాత్రద్వారా పెద్ద పెద్ద ఉపన్యాసాలు చెప్పించలేరు, బలమైన సంఘటనలకి పరిమితమైన అవకాశం ఉంటుంది. ఐనా ఈ పరిధులని అధిగమించి అలాంటి పాత్రతోనే తాను చెప్పదలచుకున్న సందేశాన్ని బలంగా చిత్రించే ప్రయత్నం చేశారు ఉమాభారతిగారు. ఈ నవలలో ప్రధాన పాత్ర గాయత్రి- మూగది, సరిగా నడవలేదు. చిన్నప్పుడు కన్నవారు అనాధగా వదిలి పెట్టడంతో గంగన్న పాలెంలోని గుడిలో పనిచేసుకునే ఓ తాత ఆ పసిగుడ్డుని చేరదీస్తాడు. అతనే గాయత్రి అనే పేరుకూడా పెట్టుకుని పెంచుకుంటూ ఉంటాడు. అలా మొదలైన గాయత్రి జీవితం ఎన్ని మలుపులు తిరిగి ఎక్కడికి చేరుకుందీ – అన్నదే ఈ నవల ఇతివృత్తం. గాయత్రి చుట్టూ అల్లిన సన్నివేశాలూ, ఇతర సహాయ పాత్రలూ కథని వేగవంతం చేయడానికి తమవంతు సహాయం చేశాయి. వాక్య నిర్మాణం సరళంగా, చదివించేలా ఉంది. సన్నివేశాల చిత్రీకరణలోనూ , ఆ పరిసరాల్లోకి పాఠకులని తీసుకెళ్ళే ప్రయత్నంలోనూ రచయిత్రి మంచిఫలితం సాధించారనడంలో సందేహం లేదు. సమయోచితంగా పల్లెటూరి యాసని వాడి, పాత్ర వ్యక్తిత్వాలని ప్రతిబింబించే ప్రయత్నం కూడా చేశారు. ఒక విభిన్నమైన కథని, విభిన్నమైన నేపథ్యంలో చదువుదామనుకునే పాఠకులకి నచ్చే నవల ఈ 'ఎగిరే పావురమా!'. రచయిత్రి ఉమాభారతిగారి కలం నుంచి మరిన్ని మంచి నవలలు వస్తాయని ఆశిద్దాం.

*****




**సినీ, టివి, నవలా** రచయిత్రిగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న శ్రీమతి బలభద్రపాత్రుని రమణిగారు, చక్కటి హాస్య రచయిత్రి అని కొన్ని సంవత్సరాలుగా కౌముదిలో వస్తున్న 'కాలమ్ దాటని కబుర్లు' నిరూపించింది, కొనసాగిస్తోంది. రమణిగారు అద్భుతమైన కథా రచయిత్రి అని ఈ దశాబ్దపు పాఠకులకి ఎక్కువమందికి తెలియకపోవచ్చు. పది, పదిహేనేళ్ళ క్రిందట రమణిగారు వ్రాసిన చక్కటి కథల్ని ఆంధ్రదేశంలోని అన్ని ప్రముఖ పత్రికలూ ప్రచురించాయి. వారి కథా సంపుటిలో రెండవది ఈ పుస్తకం. ఇందులో రమణిగారు లోగడ వ్రాయగా వివిధ పత్రికల్లో ప్రచురించబడిన కథలు 31 ఉన్నాయి. చిన్న కథలు ఎలా ఉండాలి, పాత్రల ప్రవేశం, వాటి వ్యక్తిత్వ చిత్రణ, సన్నివేశం ఎలా మొదలుపెట్టి ఎలా ముగిస్తే పాఠకులని ఆకట్టుకోగలరు.. కథారచనలోని ఇలాంటి అంశాలకి - ఇందులోని ప్రతి కథ ఒక గైడ్ లాంటిది. కథల ఇతివృత్తాలకి వస్తే ఇందులోని కథా వస్తువులన్నీ మన నిత్యజీవితాల్లోంచి వచ్చినవే. ఏ కథా కేవలం ఊహాలోకంలోంచి ఊడిపడినట్లుండదు. ప్రతి కథలోనూ కనీసం ఒక సన్నివేశమైనా మన జీవితాల్లో జరిగినదో, తెలిసిన వాళ్ళ జీవితాల్లో విన్నదే ఐ ఉంటుంది. అందుకే, ఒక్కో కథ చదివాక ఒక జీవితంలోని కొన్ని సంఘటనలని ప్రత్యక్షంగా చూసిన అనుభూతి కలుగుతుంచి. రమణిగారి స్క్రీన్‌ప్లే ధోరణి సన్నివేశాల చిత్రీకరణ కూడా పాఠకులకి ఒక సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది. మొట్టమొదటి కథ 'స్వర్గం' లోనే తృప్తికీ, అసంతృప్తికీ ఉన్న, చాలామంది గమనించలేని, అడ్డుగీతని మనసుకి హత్తుకునేలా చూపించి జీవితంలో ఎవరైనా 'స్వర్గాన్ని' ఎలా సృష్టించుకోవచ్చో చెప్పారు. 'ఒకదీపం వెలిగించు' మానవత్వాన్ని నిర్వచించే కథ. కథ చదవడం పూర్తయ్యాక, ఇందులోని పాత్రలు కొన్ని నిస్సహాయ పరిస్థితుల్లో తీసుకోవాల్సి వచ్చిన నిర్ణయాలకి, పాఠకుల మనసు ద్రవిస్తుంది. చిన్నచిన్న అనుభూతులని మనసులో నిలుపుకుంటే జీవితం ఎంత అందంగా, ఆనందంగా కనిపిస్తుందో 'వర్షం' కథ తెలియచేస్తుంది. 'ఆకాశ దేశాన' ఒక తియ్యటి విషాదాంత కథ. ఇందులోని ప్రతి కథ మనసులోంచి వచ్చినది, మనసుల్ని కదిలించే ఉద్దేశంతో వ్రాసినది. మంచి కథలు, మనసుకి హత్తుకునే కథలు, చదివాక హృదయం ఆర్ద్రమయ్యే కథలు కావాలనుకునేవారికి విందుభోజనం ఈ కథల సంపుటి. చదవడం పూర్తయ్యాక రచయిత్రి వ్రాసిన మిగతా కథలని కూడా ఎప్పుడు చదివేద్దామా అనిపిస్తుంది.

★★★

***Publishers:***
***సాహితి ప్రచురణలు***
29-13-53 కాళేశ్వరరావు రోడ్డు
సూర్యారావు పేట, విజయవాడ - 520 002
ఫోన్: 0866-2436643, 6460633
Email: sahithi.vija@gmail.com




*Publishers:*
పద్మారామం పబ్లికేషన్స్
38 / 303 - బాదం టవర్స్
సరూర్ నగర్, హుడా కాంప్లెక్స్
హైదరాబాదు - 500 035
smvyakaranam@gmail.com

విశాఖపట్నంలో 1965లో వైద్యవృత్తిలో పట్టా పుచ్చుకుని, విదేశాల్లో ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన పదవులనందుకుని, వైద్య రంగంలో ఎనలేని సేవలందించిన ప్రముఖులు డాక్టర్ వ్యాకరణం అచ్యుత రామారావు గారు. రాయల్ కాలేజీ ఆఫ్ సైకియాట్రిస్ట్ వారి ఫెలోషిప్ అందుకున్న ప్రప్రథమ తెలుగు వైద్యులు కూడా ఈయన. 52 సంవత్సరాల వయసులో కవితలు వ్రాయడం ప్రారంభించినా గత ఏడేళ్ళుగా కవితా రచనతో విశ్రాంత జీవితం గడుపుతున్నారు. ఎన్నో సంవత్సరాలు మానసిక వైద్య నిపుణులుగా పనిచేసి, ఎన్నో మనసులని నిశితంగా పరిశీలించిన, విశ్లేషించిన, రచయిత కలంనుంచి మనసుల్ని హత్తుకునే కవితలు రావడంలో ఆశ్చర్యం లేకపోవచ్చుకానీ - విశ్రాంత జీవితాన్ని కవితా సేవకు అంకితం చేద్దామనుకున్న రచయిత అంకిత భావాన్ని అభినందించి తీరాలి. వీరి కవితల్లో ఆలోచన ఉంది. కేవలం పదాల కూర్పులా కాక ముందుగా ఒక భావాన్ని తీసుకుని దాని చుట్టు కవిత అల్లడం అన్న ప్రక్రియకి ప్రతిరూపాలుగా కనిపిస్తాయి ఈ సంపుటిలోని కవితలు చాలా వరకూ.  ముందులోనే స్పష్టంగా చెప్పారు " నా మనసులో మెదిలే భావాలని - మనం మాట్లాడే మాటలతో కూర్చి - అందరికీ అర్థం అయ్యేలా - ఛందస్సుల జోలికి పోకుండా.. " వ్రాస్తున్నానని. పెద్ద పెద్ద పదాడంబరాలు, పదచిత్రాలు లాంటివి ఎక్కువగా కనిపించకపోయినా ప్రతి కవితలో ఒక ఆలోచన కనిపిస్తుంది. 'రాసే వాడెవడూ రాయకూడదు - మరింకొకడి మెప్పుకోసం, వాడిచ్చే ప్రశంసలకోసం - రాయాలి తనకోసమే, తనలో రగులుకుంటున్న - కారడవులని కాల్చబోయే కవితావేశపు జ్వాలల్ని - శాంతింప చేసే తొలకరి వానల జల్లుల్ని కురిపిస్తూ' అంటారో కవితలో. ఆల్జైమర్స్ వ్యాధి గురించి వ్రాస్తూ 'నిటారుగా నడిచే మీ ప్రియతమ నేస్తానికి - వెన్నెముక వంగి చేతికి కర్రొస్తుందని - సాయంకాలపు సంధ్యారాగాలాపనలో - నిశిరాత్రుల విషాదగీతం వినబడుతుందని - అనుకున్నారా మీరెవరైనా - అలా కలగన్నారా మీరేనాడైనా ' అని మొదలుపెడతారు. అలాగే వివిధ సందర్భాలలో వ్రాసిన కవితల నేపథ్యాలను కూడా  వివరంగా వ్రాయడంతో రచయిత ఆలోచనా సరళిని అర్థం చేసుకునేందుకు వీలౌతుంది. రమ్యభావ కుసుమాలు అన్న అధ్యాయంలో కొన్ని వలపు కవితలని కూడా పొందుపరిచారు. డాక్టర్ అచ్యుత రామారావుగారి కవితాసేవ చిరకాలం కొనసాగాలని ఆశిద్దాం.

*****




***Publishers:***

*Vishalandhra Publishing House*
Giriprasad Bhavan, Bandlaguda(Nagol)
GSI Post, Hyderabad – 68
www.visalaandhra.net

**వర్తమాన** కథా రచయితల్లో ఒక స్థాయి కల రచనలు చేస్తున్న రచయిత డా.కె.వి.రమణరావుగారు. ఆయన వ్రాసిన 26 కథల సంపుటి ఈ ‘పుట్టిల్లు‘. ఆలోచన ఈయన కథలకి ఆయువుపట్టు. ఏ కథా ఏదో సరదాగా వ్రాసినట్లుండదు. ప్రతి కథా ఎంతో ఆలోచనతో ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించి వ్రాసినట్లుంటుంది. ఉండడమే కాదు ఆ ప్రయోజనాన్ని సిద్ధింపచేస్తుంది కూడా. రచయిత ఆలోచన, పాఠకుడిలో ఆలోచనలు రేకెత్తించగలిగితే ఆ రచయిత ఆశయం ఫలించినట్లే. ఈ కోణంలో నుంచి చూస్తే రమణరావుగారి కథలు నూటికి నూరుశాతం విజయవంతమైన కథలు అని చెప్పుకోవచ్చు. ఈ పుస్తకానికి శీర్షిక ఐన‘ పుట్టిల్లు‘ కథ మనసుల్ని సున్నితంగా తట్టే కథ. ముగింపు కొంచెం అసహజం అనిపించినా అది రచయిత సూత్రప్రాయంగా తెలియచేసిన పరిష్కారం అనుకోవచ్చు. పల్లెటూరిని ఎప్పుడో వదిలేసి వచ్చిన మలి వయసు మహిళ, పుట్టిన వూరిలోని తన చిన్ననాటి స్నేహితురాళ్ళు ఆ వయసులో పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని, తానూ ఆ పుట్టిన వూరికే వెళ్ళిపోయి, వాళ్ళకి సహాయం చెయ్యాలనుకోవడం ఈ కథ ఇతివృత్తం. చివరలోవ్రాసిన వాక్యం "ఒక వేళ ఈ ప్రయత్నంలో నేను ఓడిపోతే మీకు భారం కాను" మనసుని సున్నితంగా తడుతుంది. ఇలాంటి ముగింపుల్లోనే రచయిత ప్రత్యేకత కనిపిస్తుంది. ‘పారిజాతం పూలవాసన మంచులా చిక్కగా కమ్ముకుని సప్తమినాటి చంద్రుడు మసకేశాడు‘ లాంటి వాక్యాలు కవితాత్మ కల పాఠకులని కట్టి పడేస్తాయి. ‘వెన్నెల వెలుగు ‘ కథ చదువుతుంటే ఆయా ప్రదేశాలు మన కళ్ళముందు కదులుతాయి, ఆ పాత్రతో మనమూ మమేకమౌతాం. ఎక్కువ చెప్పకుండా ముగింపులో ఎన్నో అర్థాలని పలికించిన కథ ‘పరుగుపందెం‘. ఏ కథ చదివినా ఆ కథల్లోని వాతావరణ చిత్రణ పాఠకుడ్ని అక్కడికి తీసుకెళ్తుంది. ప్రతి కథలోనూ హృదయం ఉంది, ఆర్తి ఉంది, సమాజక్షేమంకోసం,వ్యక్తి వికాసం కోసం రచయిత పడే తపన ఉంది. మంచి కథలు, గుర్తుంచుకోదగ్గ కథలు, ప్రయోజనాత్మకమైన కథలు వ్రాస్తున్న డా.రమణరావుగారి కలం నుంచి మరిన్ని కథలు రావాలని కోరుకుందాం.

★★★




E-Publishers:
Aparajita Publications

For copies:
Kingie.com

**అలనాటి** ఆకాశవాణితో పరిచయమున్న వారందరికీ ఉషశ్రీగారిని వేరేగా పరిచయం చెయ్యాల్సిన అవసరం లేదు. ఆ ఉషశ్రీగారి కుమార్తె డా.గాయత్రీదేవిగారు. తండ్రిగారి సాహితీవారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న గాయత్రీదేవిగారు అరుదుగా వ్రాసినా చక్కటి కథలు వ్రాశారు. ఆమె ప్రముఖ ఆయుర్వేద వైద్యురాలిగా పత్రికలద్వారా, టీవీల ద్వారా ఆంధ్రదేశంలోనీ, విదేశాల్లోనీ తెలుగువారందరికీ చిరపరిచితులే. డా.గాయత్రీదేవిగారు వ్రాసిన 25 హాస్యకథల / మామూలు కథల సంపుటి ఈ 'హాస్యాహాస్య కథలు'. అచ్చుపుస్తకంగా కాకుండా డిజిటల్ పుస్తకంగా (ఇ-పుస్తకంగా) కినిగె.కామ్ వారి ద్వారా విడుదలచేయబడింది. చక్కటి ముఖచిత్రం, అందమైన కూర్పు కాబట్టి ఇ-పుస్తకమైనా ప్రింట్ పుస్తకం చదువుతున్నట్లే ఉంటుంది. ఈ కథల్లో పగలబడి నవ్వించే హాస్యం కంటే అర్థవంతమైన, ఉపయోగకరమైన, చతురోక్తుల్లాంటి హాస్యం ఎక్కువగా ఉంది. హాస్యకథల్లో ప్రయోజకతని జోడించడం డా.గాయత్రీదేవిగారు చేసిన అద్భుతమైన ప్రయోగం. సాధారణంగా పౌరాణిక పాత్రలాతో హాస్యాన్ని సృష్టించాలనుకున్నప్పుడు ఆయా పాత్రలని కొంచెం వెకిలిగా చిత్రించడం పరిపాటి, కానీ రచయిత్రి తన మొట్టమొదటి కథలో దేవేంద్రుడు, భూదేవి, ఊర్వశి పాత్రలతో కథ అల్లినా ఎంతో చక్కటి అంశాన్ని ఆయాపాత్రల ద్వారా ఉదాత్తంగా చెప్పించారు. మనుషులు బరువుతగ్గితే, స్లిమ్‌గా ఉంటారు, తద్వారా భూభారం తగ్గుతుంది అనేది మొదటి కథ ' ఊర్వశీ.. పాలసీ..' లో ఇతివృత్తం. తాము ఎలా పెరిగినా, ఏం సాధించలేకపోయినా పిల్లలు మాత్రం ప్రపంచంలోని అన్నిరంగాల వ్యక్తుల్లా అర్జంటుగా పేరుతెచ్చుకోవాలని తాపత్రయపడే తల్లిదండ్రులకు చక్కటి చురక - 'కన్న' వారి కలలు. ముగింపువాక్యం అందర్నీ ఆలోచింపచేస్తుంది. 'భామాకలాపం' అద్భుతమైన కథనంతో అందరికీ తెలిసిన కృష్ణ-సత్యభామల కథకి ఓ అందమైన ముగింపుతో కూర్చిన కథ. సరళమైన వాక్యశైలి, సన్నివేశ చిత్రీకరణ ఈ కథలకి ఉన్న మరో చక్కటి గుణం. పాఠకులని అలవోకగా చదివింపచేసే ఈ కథలు కాలక్షేపానికి, చిరునవ్వులకే పరిమితంకాకుండా ఏదో ఒక అర్థవంతమైన అంశాలు తమలో పొదువుకున్నాయి. ఈ సరికొత్త శైలిలో, సున్నితమైన హాస్యంతో సాగిన ఈ హాస్యకథల / మామూలు కథల రచయిత్రి డా.గాయత్రీదేవిగారు అభినందనీయులు.

***




**Available at:**

*All leading book stores in Telugu States*

**ఇటీవలే దివంగతులైన** శ్రీ ఉపాధ్యాయుల అప్పల నరసింహమూర్తిగారు వ్రాసిన పుస్తకం ఇది. తెలుగు సాహితీ సమీక్షా రంగంలో విశేషమైన కృషిచేసిన మూర్తిగారు తమ సొంతసంతకాన్ని నిలబెట్టుకునే అరుదైన గ్రంథాలెన్నింటినో రచించారు. అందులో ఒకటి ఈ పుస్తకం. కథకానీ, నవలకానీ, వ్యాసం కానీ - చదివేప్పుడు పాఠకుడ్ని ఒప్పించి చివరంటా చదివించే గుణం రచనకి చాలా అవసరం. రచనా వస్తువు, పాఠకులు ఆ వస్తువుతో అంగీకరిస్తున్నారా లేదా.. ఇలాంటివన్నీ ఒక ఎత్తు ఐతే అసలు చదివించగలుగుతోందా లేదా అనేది ప్రధానం. ఒక రచనకి ఉన్న చదివించే లక్షణాన్నే శైలి అని సూక్ష్మంగా చెప్పుకోవచ్చు. తెలుగులో వచన శైలి గురించిన సమగ్రమైన పరిశోధనా గ్రంథం లేని లోటుని ఈ పుస్తకం తీరుస్తుంది. 'శైలి అంటే ఏమిటి? దాని స్వరూప స్వభావాలు ఎటువంటివి? శైలిని గురించి తెలుసుకోవడం వల్ల ప్రయోజనం ఏమిటి? మంచిశైలిని అలవాటు చేసుకోవడమెలా? దానిని రూపొందించే లక్షణలేమిటి? శైలీదోషాలు ఎలా ఏర్పడతాయి?' - ఇలాంటి అంశాలని అతి సులభంగా, సరళంగా అంతకు మించి ఆసక్తికరంగా వివరించారీ పుస్తకంలో మూర్తిగారు. ముందు మాటలో రచయిత ఇలా అంటారు "గొప్ప రచయితలందరూ గొప్ప శైలీనిర్మాతలు కారు. గొప్ప శైలీనిర్మాతలందరూ గొప్ప రచయితలు కాలేదు. ఈ రెండు శక్తులకు తుల్యగౌరవాన్ని సాధించగలిగిన రచయితలు గొప్పవారు." తదుపరి పుటల్లో రచనాశైలి గురించి వివరిస్తూ "శైలి అనేది సంకీర్ణత నుంచి సంకీర్ణతకు కాక సౌలభ్యం నుండి సంకీర్ణత దిశగా కొనసాగాలి. ముందే అవగాహనకందని విషయం, అర్థంగాని భాష ఉంటే పాఠకుడు బెంబేలు పడిపోతాడు. ముందు గోరుముద్దలు తినిపించాలి. తరువాత తరువాత కబళం తాళ్ళఫల ప్రమాణమైనదైనా ఫరవాలేదు. తొలిదశనుండి మలిదశ చేరుకునేప్పటికి పాఠకుడికీ రచయితకీ మధ్య ఒక ఒడంబడిక ఏర్పడుతుంది. అప్పుడు కథ సుఖంగా నడుస్తుంది." వర్థమాన రచయితలకు ఇలాంటి ఉపయుక్తమైన సూచనలు చాలా ఉన్నాయి ఈ పుస్తకంలో. చివరి అధ్యాయంలో కొంతమంది ప్రముఖ రచయితల రచనా శైలిగురించి, 'శైలి' గురించిన వారివారి అభిప్రాయాలని వివరించారు. రచనా వ్యాసంగాన్ని ఒక గంభీరమైన ప్రక్రియగా భావించేవారందరూ చదివి తీరాల్సిన విలువైన పుస్తకం ఇది. పుస్తకం అంతాచదవడం పూర్తయాక, ముందుమాటలో ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణగారు చెప్పిన భావాలతో నూటికి నూరుశాతం ఏకభవిస్తాం "మనకు మనమే శైలిలో స్వయంశిక్షణ పొందటానికి ఇటు మార్గాన్ని, అటు పాఠ్యసామగ్రిని సుసంపన్నంగా అందించారు. అలా ఇదొక సర్వోత్కృష్టమైన పాఠ్య పరామర్శ (రిఫరెన్స్ టెక్స్ట్) గ్రంథమౌతోంది. తెలుగుభాషకే ఒక కొత్త అలంకరణగా భాసిస్తోంది"

***




**For Copies**
K.MuraliMohan
9111, Block 9A
Janapriya Mahanagar,
Meerpet, Hyderabad- 500 097
Ph: 9701371256
&
All leading Book Sellers in A.P. and T.S.

1882 నుంచి 1944 వరకూ వచ్చిన, ఈ తరానికి అందుబాటులో లేని, ఎనిమిది పత్రికలనుంచి, రాయలసీమకు చెందిన రచయితలు వ్రాసిన, 42 కథల్ని సేకరించి ఇందులో అందించారు. ఆ పత్రికలు జనవినోదిని(1882), హిందూసుందరి(1913), సౌందర్యవల్లి(1918), శారద(1922), శ్రీ సాధన (1926 - 1941), తెనుగు తల్లి (1937), విజయవాణి (1941), చిత్రగుప్త(1944). వీటిల్లో జనవినోదిని, హిందూసుందరి, శారద, చిత్రగుప్త పత్రికలు తప్ప మిగతావన్నీ రాయలసీమ ప్రాంతం నుంచి వెలువడిన పత్రికలే. ప్రతి కథతోబాటు లభ్యమైన చోట ఆయా రచయిత వివరాలు జతచేయడం, ఆయా పత్రికల వివరాలూ తెలియచేయడం ఈ పుస్తకానికి విశిష్టత కల్పిస్తున్నాయి. రాయలసీమ కథ పుట్టుక, పరిణామం గురించి, కథల వస్తురూప, భావజాలాల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్నవాళ్ళకి ఈ సంకలనం అద్భుతమైన కరదీపిక. కేవలం కథలని సేకరించి ఒకచోట చేర్చడమే కాక దీనినొక పరిశోధనా గ్రంథంగా తీర్చిదిద్దారు సంపాదకుడు డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డిగారు. రాయలసీమ కథల గురించి, రాయలసీమనుంచి వెలువడిన పత్రికల గురించి అత్యంత విలువైన సమాచారాన్ని 'ముందుమాట'లో పొందుపరిచారు హరినాథ రెడ్డిగారు. ఒక్కో కథనీ, శిల్పాన్నీ విమర్శనా దృష్టితో చూడ్డం కంటే వీటన్నింటినీ చారిత్రక నేపథ్యం దృష్టితో చూడాల్సిన అవసరం ఉంది. ఈ కథలు చదువుతుంటే కాలయంత్రంలో వందేళ్ళు వెనక్కి వెళ్ళివస్తాం. అప్పటి కుటుంబసంబంధాలు, సామాజిక పరిస్థితులు, వ్యక్తిత్వాలు, వాటిని ప్రభావితం చేసిన అంశాలు, అప్పటి సమస్యలు... వీటన్నింటి గురించి తెలుసుకోవడం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఏ రంగానికైనా చరిత్ర ముఖ్యం. చరిత్ర పునాదులపైనే వర్తమానమైనా, భవిష్యత్తు ఐనా ఆధారపడి ఉంటుంది. ఈ కోణంలో చూస్తే ఈ పుస్తకం ఒక విలువైన కథా చరిత్రకి పట్టిన నిలువెత్తు దర్పణం. దీని విలువ అమూల్యం. "తెలుగు సాహిత్య ప్రపంచంలో తెలుగు కథ ప్రసక్తి వచ్చినప్పుడల్లా ఈ పుస్తకం పేరు వినపడక తప్పదన్న విశ్వాసంతో, చారిత్రకంగా, సామాజికంగా, సాహిత్యపరంగా అత్యంత విలువైన పుస్తకాన్ని అందిస్తున్నందుకు గర్విస్తున్నాం." అన్న ప్రచురణకర్తల విశ్వాసం నూటికి నూరుపాళ్ళు యదార్థం.

***




**అమెరికాలోని** ప్రవాసాంధ్రరచయితల్లో సీనియర్ మోస్ట్ కథా రచయిత మందపాటి సత్యంగారు. గత మూడు, నాలుగు దశాబ్దాలలో తన కథలని పలుసంపుటాలుగా వెలువరించారు. అవన్నీ విశేషంగా ప్రజాదరణ పొందాయి. 'తెలుగు వాడు పైకొస్తున్నాడు. తొక్కెయ్యండి' అనే సత్యంగారి ఒక కథా శీర్షిక తెలుగులో జాతీయంలా ప్రాచుర్యం పొందింది. సత్యంగారి కథల్లో సంక్లిష్టమైన వాక్యాలు, లోతుగా ఆలోచిస్తేగానీ అర్థంకాని భావాలు, పాఠకుల మెదడుకి తీవ్రమైన అభ్యాసం కలిగించే సన్నివేశాలు.. ఇలాంటివేమీ ఉండవు. సరళంగా, సూటిగా సాగే కథనం, మొదటినుంచీ చివరిదాకా ఆపకుండా చదివించే శైలి సత్యంగారి కథల ప్రత్యేకత. వారి తాజాకథల సంపుటి - సత్యం శివం సుందరం. శీర్షికకి తగినట్లుగానే ఈ సంపుటిలోని కథల్లో కథాంశాలు ఈ మూడు భావాలకి పూర్తిన్యాయం చేకూర్చేలా ఉన్నాయి. కథా వస్తువు విషయానికి వస్తే ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. అమెరికా జీవితాల్లో చాలా తక్కువమంది మాత్రమే చూడగలిగిన కోణాలు ఈ కథల్లో చోటుచేసుకున్నాయి. అలానే అరుదైన ఆరోగ్యసమస్యల నేపథ్యంలో సాగిన కథలు - సాధించావే మనసా, నాతి చరామి, సంధ్యావందనం - రచయితగా సత్యంగారి ప్రత్యేకతని నిలబెడతాయి. సంక్లిష్టమైన అంశాలని కూడా అతిసులువుగా పాఠకులకి అర్థమయేలా కథా రూపంలో మలచడంలో రచయిత విజయాన్ని ఈ సంపుటిలోని ప్రతి కథా నిరూపిస్తుంది. తల్లీ కొడుకుల మధ్యఉండాల్సిన అనురాగం, అపార్థాలు ఇతివృత్తంగా సాగిన మొదటి కథే 'సౌమ్య', కరుణ రస ప్రధానంగా సాగి ఈ సంపుటి తెరిచిన పాఠకుల మనసులని హత్తుకుంటుంది. ఇందులో చోటుచేసుకున్న 26 కథలూ ప్రముఖ పత్రికల్లో ప్రచురితమైనవే. సత్యంగారి కలంనుంచీ వెలువడ్డ హాస్యకథలు కూడా తమవైన ప్రత్యేకతని నిలబెట్టుకుంటాయి. ఈ కథలన్నీ చదివాక పాఠకులకి - కొన్ని సరికొత్త విషయాలని తెలుసుకున్నామన్న తృప్తి మిగులుతుంది, మానవసంబంధాల్లోని సున్నితమైన కోణాలని మరోసారి స్పృశించిన అనుభూతి ముద్రించుకుపోతుంది, ప్రయోజనాత్మకమైన కథాంశాలని ఎన్నుకున్న రచయితపట్ల అభిమానం పెరుగుతుంది. ముందుమాటలో గొల్లపూడిగారు చెప్పినట్లు - ఈ కథలన్నింటికీ అందమైన చట్రం ఉంది, ఇతివృత్తంలో వైవిధ్యం ఉంది. చెప్పడంలో తనదైన ఒడుపు ఉంది - వెఱసి చెయ్యి తిరిగిన సాక్ష్యం ఉంది.

★★★

***Available at:***

*Navodaya Book House*
*Opp. Arya Samaj Mandir,*
*Kachiguda X Roads*
*HYDERABAD – 5000 027*

***Writer Email:***
*Satyam_mandapati@yahoo.com*




***Published by***
Ravali Sahiti
Khammam, Tenali, Hyderabad

***Avaialble at:***
All leading Book Sellers in A.P. and T.S.
Ebook: www.kinige.com

**ఆధునిక** తెలుగు కవితాప్రపంచంలోకి నిలకడైన మెరుపులా దూసుకొచ్చిన కవి మువ్వా శ్రీనివాసరావుగారు. తాను నియమించుకున్న ఆదర్శాల పరిమితులని దాటకుండా వేగంగా వ్రాస్తున్నా ఎక్కడా నాణ్యత తగ్గని కవితలని అందిస్తున్నారీయన. ఆధునిక సాహిత్యంలో ఇంత వేగంగా వ్రాస్తున్న కవి మరొకరు లేరంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. కవికి సామాజిక బాధ్యత ఉండాలి అని నమ్మి, ఆచరిస్తున్న కవి శ్రీనివాసరావుగారు. వీరి కవితల్లో మెదడుకు పదునుపెట్టే కవితలూ, అదే సమయంలో హృదయాన్ని కదిలించే కవితలూ ఉండడం గమనార్హం. తన తొలి కవితాసంపుటి 'సమాంతర రేఖలు' తోనే ఎంతో మంది అభిమానుల్ని సంపాదించుకున్నారీయన. అందరు సమీక్షకులతోనూ, విమర్శకులతోనూ ఏకగ్రీవంగా సానుకూల ప్రశంసలని పొందిన మువ్వా శ్రీనివాసరావుగారి కలం నుంచి వెలువడిన రెండవ కవితా సంపుటి '6th ఎలిమెంట్'. ఇందులో 78 కవితలు ఉన్నాయి. ఈ పుస్తకానికి వ్రాసుకున్న ముందుమాటలో "కవిత్వ రూపం మీదకంటే దృక్పథం మీద ఎక్కువ పట్టింపుతో ఉన్నాననిపించింది. కవిత్వం భావనమీద, అలంకారాల మీద వ్యక్తీకరణ మీద కంటే దృక్పథాన్ని కలిగించడం మీద ఆధారపడి ఉండాలని భావిస్తాను" అని చెప్పారు శ్రీనివాసరావుగారు. కానీ ఇందులో ఏ కవితని తీసుకున్నా అందులో ఒక దృక్పథంతో పాటు, అద్భుతమైన కవితాత్మ తప్పనిసరిగా కనిపిస్తుంది. సరికొత్త పదచిత్రాలు పలకరిస్తాయి. సిలికాన్ వేలీ గురించి చెబుతూ 'ఇసుకపూల జ్ఞాపకం ' అనే శీర్షికలో 'ఎనిమిదో స్థానంలో నిలిచిన / సిలికాన్ మూలక మిప్పుడు / సమస్తాన్ని అంగుళంలో బంధించింది/ మనిషి మనిషికి / రెండో మెదడును సృష్టించింది'. 'రెండో మెదడు , ఇసుకపూలు ' అనే వ్యక్తీకరణల్లో 'కవి ఎంత భావాన్ని, ఆలోచనని పొదిగారో!' అనిపిస్తుంది. "ఎప్పుడూ మాత్రం / సూర్యుడు మా అమ్మ నుదుటి బొట్టై / నిలబడ్డట్టనిపిస్తుంది..", " పెన్సిల్‌కు లాగానే / ప్రేమకు షార్పెనర్ కావాలి / కాలయవనికపై ప్రేమకావ్యాలు / చెక్కేందుకు/ చిత్రించేందుకు/ రాసేందుకు!" లాంటి భావనలు పదే పదే ఆలోచింపచేస్తాయి. ఈ కవికి జీవితం పట్ల, సమాజం పట్ల, మనిషి పట్ల సీరియస్‌నెస్ ఉంది. విధ్వంసక భావాలపట్ల నిరసన ఉంది. లోకకల్యాణం కోసం కల ఉంది, మంచితనం మీద భరోసా ఉంది. అందుకే ఏ కవితలోనైనా తను చూసింది చూసినట్లే వ్రాసినా చాలా చోట్ల ఓ ఆశాకిరణాన్ని, పరిష్కార స్వరాన్నీ ధ్వనిస్తారు. "ఇప్పుడు నా తెలుగు గడ్డ నిండ / నిద్రలేచిన నిప్పుపూల పొదలు / పొంగిపొర్లుతున్న కసివాసన పొగలు / చీలిన జెండా గుడ్డల రెపరెపలు... / వేరుపడ్డా జోరు తగ్గనీయకుండా / చీలిన పాళీలా - తెలుగక్షరం రాయకుండా / ఎందుకిలా చిత్తగొడుతున్నారో/ తిట్లు పడుతున్నారో.." సమకాలీన పరిస్థితుల్ని 'నిప్పుపూల పొదలనుంచి వెలువడే కసివాసన పొగల'తో పోల్చడంలో ఎన్నో భావాలని చెప్పకనే చెప్పారు. శ్రీనివాసరావుగారి కవిత్వం చదవడం ఒక అనుభూతి, అనుభవం మాత్రమే కాదు - ఒక అవసరం కూడా.! ★★★




***Published By:***

*Kalakeli Publications*
*PITHAPURAM, AP*
*533 450; Phone: 08869 - 52208*

***Available at:***
*All leading book stores*

**కవిత్వాన్ని** చదివి, అర్థం చేసుకుని, ఆస్వాదించి, ఆనందించాలంటే ఒక విధమైన అభిరుచి ఉండాలి, రసహృదయం కావాలి. తెలుగులో వచ్చే కవితా సంపుటాలని ఎంతమంది నిజమైన కవితాదృష్టితో చదివి ఆనందిస్తున్నారన్నది ప్రశ్నార్థకమే.! ఇలాంటి వాతావరణంలో ఒక యువకవి (ఇటీవలే కవిత్వం వ్రాయడం ప్రారంభించిన కవి అనే అర్థంలో) ప్రచురించిన రెండు కవితా సంపుటాల్లోని దాదాపు 150 కవితలని ఒక లబ్ధప్రతిష్ఠుడైన కవితావిమర్శకుడు సమగ్రంగా విశ్లేషించడం అత్యంత అరుదైన ప్రక్రియ. కవి ముప్వా(క్రాంతి) శ్రీనివాసరావుగారు తన 53వ ఏట కవిత్వాన్ని వ్రాయడం ప్రారంభించి పుంఖాను పుంఖాలుగా కవితలు వ్రాయడమే కాక, ఏకగ్రీవంగా కవిత్వాభిమానులందరితో ప్రశంసలు పొందుతున్నారు. రెండేళ్ళలో రెండు కవితా సంపుటాలని ప్రచురించారు (వీటి పరిచయం ఇదే శీర్షికలో కౌముది గత సంచికల్లో వచ్చాయి). ఈ కవితలని చదివి(చదివించుకుని), ఆ కవితల్లోని నిబద్ధతకీ, నిజాయితీ, నవ్యత్వానికీ ముగ్ధులైన ప్రసిద్ధకవీ, విమర్శకులూ ఐన అవంత్స సోమసుందర్‌గారు ఈ 'కవితా విపంచి క్రాంతి గీతాలు' అనే పుస్తకాన్ని వ్రాశారు. చాలా కవితా పరిచయాల్లో ఉన్నట్లు కేవలం కవితల్లోని పంక్తులఉదాహరణకి పరిమితం కాకుండా, ఒక్కో కవితనీ కూలంకషంగా చర్చించారు. పరిమితులుంటే, లోపాలనిపిస్తే నిర్మొహమాటంగా చెప్పారు. శ్రీనివాసరావుగారి కవితల్లోని ఉత్తమ గుణాలని మరింత కవితాత్మకంగా వివరించడం సోమసుందర్ గారికి మాత్రమే చేతనైన కళ. కేవలం కవితా ప్రశంసకే పరిమితం కాకుండా సందర్భోచితంగా కవితా రచనా ప్రక్రియలోని సూక్ష్మమైన అంశాలెన్నింటినో సరళంగా వివరించారు సోమసుందర్ గారు. ఈ పుస్తకం చదివాక మళ్ళీ శ్రీనివాసరావుగారి కవితలు చదవాలనిపిస్తుంది, మళ్ళీ చదివినప్పుడు ఆ కవితల్లోని మార్మికత కొత్తకోణంలో దర్శనమిస్తుంది. సోమసుందర్‌గారి వయసు ప్రస్తుతం 91 సంవత్సరాలు. ఈ పుస్తకంలో ఆయనే పేర్కొన్నట్లు ఆయనకు అంధత్వం ప్రాప్తించి అక్షరాలని దూరం చేసింది. శరీరంలో సర్వశక్తులూ హరించుకుపోయాయి. మిత్రులో, హితులో అక్షరాలు అందిస్తే తప్ప ఆలోచించే శక్తి కలగడంలేదు. ఐనా సెల్ఫ్ పిటీకి లోనుకాని తనమే సోమసుందర్‌గారితో ఈ పుస్తకం వ్రాయించింది. ఒకరు చదివి వినిపిస్తే విని, ఆయన డిక్టేట్ చేయగా మనముందుకి వచ్చిన విశిష్టమైన పుస్తకం ఈ 'కవితా విపంచి క్రాంతి గీతాలు'. ఇది కేవలం విమర్శనా గ్రంథమో, పరిచయ పుస్తకమో, ప్రశంసా వ్యాసమో కాదు - 'వ్యాఖ్యానాత్మక విమర్శ'. అంత సీనియర్ రచయితని కదిలించి, అననుకూల పరిస్థితుల్లో సైతం ఈ పుస్తకం రచించేంతటి స్ఫూర్తిని కలిగించిన ముప్వాశ్రీనివాసరావుగారి కవితా శక్తిని అభినందించక

***




***For Copies***
**B.Narsan**
**1-1-276/A, Flat# 104**
**RK Apartments, Street# 1**
**Chikkadpalli, HYDERABAD – 500 027**
**Cell: 9440128169**

"**నిజాయితీ** నిండిన సృజనాత్మకత రావాలంటే జీవిత రథచక్రాల కింద పడి నలగాలి" అని అనుభవజ్ఞులు చెప్పినట్లే, జీవిత రథచక్రాల కింద పడి నలుగుతూనే భయంకర వాస్తవాలని కవిత్వీకరించిన అసలు సిసలైన సామాజిక కవి అలిశెట్టి ప్రభాకర్. 1980 దశకంలో అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం చదవని, ప్రభావితంకాని, మెచ్చుకోని కవిత్వాభిమానులు లేరు అనడంలో అతిశయోక్తిలేదు. 'సిటీ లైఫ్ ' శీర్షికలో ఆరేళ్ళపాటు ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రభాకర్ వ్రాసిన లఘు కవితలు (తనే బొమ్మలు వేసుకున్నాడు) తెలుగు పాఠకలోకాన్ని ఒక కుదుపు కుదిపాయి. చిత్రకారుడుగా వృత్తిజీవితాన్ని ప్రారంభించి, కవిగా కొనసాగిన అలిశెట్టి ప్రభాకర్, తన కవితలకి తనే చిత్రాలు వేసుకుని చిత్రకవితలుగా వాటిని ప్రజల్లోకి తీసుకెళ్ళాడు. ఇతను నిర్వహించిన కవితా ప్రదర్శనలు ఆనాటి యువతరంలో ఒక పెద్ద సంచలనమే కలిగించాయి. అతడి కవిత్వంలో అలంకారాలు, ఉపమానాలు, అందమైన పదచిత్రాలు.. ఇవికాదు కనిపించేవి - నగ్నజీవన వాస్తవాలు, ఆలోచనలని కలచివేసే సామాజిక సమస్యల చిత్రణ, మన చుట్టూ నిత్యం తిరుగుతున్నా మనం పట్టించుకోని అభాగ్యుల ఆక్రందనలు - ఇవీ ప్రభాకర్ కవిత్వానికి కవితా వస్తువులు. ప్రకృతి, ప్రణయం .. ఇలాంటివి ఈ కవితల్లో కాగడావేసి వెదికినా కనిపించవు. జీవితాంతం నిబద్ధతతో కవితలు వ్రాసిన ప్రభాకర్ లాంటి కవులు అత్యంత అరుదుగా తారసపడుతుంటారు. ఒక వైపు దుర్భరమైన పేదరికం, మరో వైపు సాలెగూడులాంటి నగరజీవితంలో చిక్కుకుని బయటకు రాలేని నిస్సహాయత , ఇంకోవైపు రోజురోజుకి క్షీణించిన ఆరోగ్యం - ఈ జీవన నేపథ్యంలో ప్రభాకర్ వ్రాసిన కవితలు మానసిక ఉదాసీనతని దహనంచేసే నెత్తుటి మంటలు, దున్నపోతు సమాజంపై కొరడా దెబ్బలు. వీటిల్లో ఎన్నో లఘుకవితలు 'కోటబుల్ కోట్స్' లా ఎన్నో సందర్భాల్లో ఇప్పటికీ ఉదహరించబడుతున్నాయి. వాటిల్లో ఒక కవిత " **వేశ్య** - తను శవమై / ఒకరికి వశమై / తనువు పుండై / ఒకడికి పండై / ఎప్పుడూ ఎడారై / ఎందరికో ఒయాసిస్సై..!". కేవలం సమాజాన్ని ఎక్స్ రే తీసిచూపించడమే కాదు, చైతన్యాన్నివ్వడం కూడా ప్రభాకర్ కవితల్లోని ఒక లక్షణం. ఉదా. " **గుండెసైన్యం** - చీకట్లో జడుసుకుంటే / ఒక చెట్టే నీ చుట్టూరా / అరణ్యమై భయపెడుతుంది!/ గుండెంటూ కలిగుంటే / నీ వెంట అదే పెద్ద / సైన్యమై నిలుస్తుంది" . " **కవి - సమ్మెట** - చదివిన కవిత "చలి - ముదుసలి' / కప్పించుకుంది కశ్మీరు శాలువా" లాంటి కవితలూ ప్రభాకర్ కవిత్వంలోని మరోకోణం. లోగడ విడివిడిగా సంపుటాలుగా వచ్చిన అలిశెట్టి కవితలన్నింటినీ ఒక్కచోట చేర్చి, 7 విభాగాలుగా వందలాది కవితలని కూర్చి 335 పేజీల పుస్తకంగా మన ముందుకి తీసుకొచ్చారు ప్రభాకర్ మిత్రబృందం. ఈ బృహత్ కవితా సంపుటికి సంపాదకులు జయధీర్ తిరుమలరావు, నిజాం వెంకటేశం, బి.నర్సన్. సరిగ్గా తన 39 వ పుట్టినరోజున జనవరి 12, 1993 న మరణించిన అలిశెట్టి ప్రభాకర్ కవితలని ముందుతరాల కందించే ప్రయత్నాలు చేస్తున్న ఆయన మిత్రబృందాన్ని ముఖ్యంగా బి.నర్సన్‌గారిని అభినందించి తీరాలి.

***




***Available at:***
*Visalandhra Book House – All branches*

**జీవించడానికి** ఏమి చెయ్యాలి? ఏదో ఒక పనిచెయ్యాలి! ఉన్నతవర్గానికి చెందిన వాళ్ళకి వంశపారంపర్యంగా వచ్చే వ్యాపారాలో ఉద్యోగాలో ఉంటాయి. మధ్య తరగతి వాళ్ళూ, ఇంకా తక్కువ వర్గాలవాళ్ళు చదువుకుంటే ఉద్యోగాలు వెదుక్కోవచ్చు, మరింత చైతన్యం ఉన్నవాళ్ళు వచ్చిన అవకాశాలని అందిపుచ్చుకునో, అవకాశాలు కల్పించుకునో జీవితంలో ఉన్నతస్థానాలకి చేరుకోవచ్చు. ఇటువంటి ఏ అవకాశాలకీ నోచుకోని. అవకాశాలు ఉంటాయని కూడా తెలీని వాళ్ళు, ఇంకా అభివృద్ధి పథంలో ఉన్న ఏ సమాజంలోనైనా కనిపిస్తూనే ఉంటారు. జీవించడం కోసం, కుటుంబపోషణకోసం వాళ్ళు చేస్తున్న శ్రమ, ఎంచుకున్న మార్గాలు గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. సరైన కోణంలో విశ్లేంచగలిగితే బోలెడంత స్ఫూర్తి లభిస్తుంది. అన్నీ ఉండీ ఇంకా ఏదో లేదని బాధపడేవాళ్ళకి ఇలాంటి బడుగుజీవుల జీవనచిత్రాలు అనేకపాఠాలు చెబుతాయి. ఈ పుస్తకంలోని జీవనచిత్రాలు మూడున్నర దశాబ్దాల క్రిందట ఆంధ్రదేశంలోని కొంతమంది 'అధోజత్పహోదరులకు' సంబంధించినవి. అప్పుడే కాదు, ఇప్పటికీ, ఆంధ్రదేశంలోనే కాదు ఎదుగుతున్న ఏ సమాజంలోనైనా ఇలాంటి వారు తారసపడుతూనే ఉంటారు. ఈ నిజజీవిత గాథలన్నీ అప్పట్లో 'ఈనాడు' దినపత్రికలో వారానికి ఒకటి చొప్పున సంవత్సరంపాటు ప్రచురితమయ్యాయి. వ్రాసింది - ఏడవ తరగతి వరకూ మాత్రమే చదువుకుని మూడు విశ్వవిద్యాలయాలతో గౌరవ డాక్టరేట్‌లు అందుకునే స్తాయికి ఎదిగిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత స్వర్గీయ రావూరు భరద్వాజ గారు. భరద్వాజగారు కూడా చిన్నతనంలో బ్రతుకుతెరువుకోసం వ్యవసాయకూలీగా, పశువులకాపరిగా, రంపంలాగే పనివాడిగా, తిత్తులూదే కూలీగా, పేపర్ బోయ్‌గా పనిచేశారు. అందుకే ఈ ఫీచర్ అనుకున్నప్పుడు వీటిని వ్రాయడానికి సరైన రచయిత భరద్వాజ గారే అని నిర్ణయించుకున్నామని ఈ పుస్తకానికి ముందు మాటవ్రాసిన రామోజీరావు గారు చెప్పారు. భరద్వాజగారు హైదరాబాదు వీధుల్లో తిరుగుతూ వివిధరకాల పనులతో జీవనం వెళ్ళదీస్తున్న వారిని ప్రత్యక్షంగా ఇంటర్వ్యూ చేసి ఈ కథనాలని వ్రాశారు. వీళ్ళంతా ఏ రోజు తిండికి కావలసిన డబ్బులు ఆ రోజు సంపాయించుకోగలిగితే చాలు అనుకునే వాళ్ళే. ఫుట్ పాత్ మీద కొంచెం జాగా చూసుకుని గొడుగులు బాగుచేసే శంకరయ్య, తోపుడు బండిమీద ఆఫీసుల్లో పనిచేసేవాళ్ళకి టిఫిన్ కేరీజీలు మోసుకెళ్ళే అంజమ్మ, రోడ్డుపక్కన దోసెలు వేసే సావిత్రమ్మ, గోడలకి వెల్ల వేసే సత్తెయ్య, తాపీ పనిచేసే శేషయ్య, సోదిచెప్పే నరసమ్మ.. ఇలా 52 మంది గురించిన కథనాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. సమాజంలో ఎక్కువమందికి కనిపించని, ఎక్కువమంది పట్టించుకోని కోణాలపై సెర్చ్‌లైట్ ఈ పుస్తకం. వీళ్ళు మనుషులే... వీళ్ళలోనూ మానవత్వం ఉంది, నిజాయితీగా బ్రతకాలనే ఆశ ఉంది, కష్టించాలనే మనస్తత్వం ఉంది.. అన్నింటికీ మించి ఓటుహక్కూ ఉంటుంది, కానీ ఏ ప్రభుత్వమూ వీళ్ళ సంక్షేమంకోసం పథకాలు చేపట్టిన దాఖలాలు ఎక్కువగా కనిపించవు. వారి జీవితచిత్రాలని గ్రంథస్థం చేసిన రావూరి భరద్వాజగారి ఈ బృహత్ప్రయత్నం సాటిలేనిది, శతథా ప్రశంసనీయమైనది.

★★★★




ప్రతులకు:
ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు
15-35 నిర్మలా సదన్, శ్రీనివాస నగర్
సిరినగర్ కాలనీ, విజయవాడ - 520 007
ఫోన్: 98494 99169

'తింటే గారెలే తినాలి, వింటే భారతమే వినాలి" అని ఒకరంటే 'కమ్మని గారెలేని తినగాతినగా వెగటబ్బు గాని, నిత్యమ్మును భారతమ్ము వినగావినగా వెగటబ్బునే' అని మరొకరన్నారు. అలానే సృష్టిమొత్తంలో అత్యద్భుతమైన, నిరుపమానమైన రచయిత ఎవరు అంటే వ్యాసమహర్షి అని నిస్సందేహంగా చెప్పొచ్చు. వ్యాసమహర్షి విరచితమైన మహా భారతంలో లేని అంశం ప్రపంచ వాఙ్మయంలో లేదనడంలో అతిశయోక్తి లేదు. ఆంధ్ర వాఙ్మయ చరిత్రలోనూ 'మహాభారతం'పై వచ్చినన్ని పరిశోధన, పరిశీలన గ్రంథాలు మరిదేనిపైనా రాలేదు. అలానే మహాభారతానికి అనువాదాలూ, స్వీయ విశ్లేషణలూ తెలుగులోనే అనేకం వచ్చాయి. అందులో పద్యకావ్యాలూ ఉన్నాయి, వచన గ్రంథాలూ ఉన్నాయి. ఎవరు మహాభారతం గురించి వ్రాసినా తమదైన ప్రత్యేకత ఉండేలా చూసుకుంటూ ఉంటారు. ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు గారు వ్రాసిన ఈ వచన మహాభారతంలో కూడా తమదైన ప్రత్యేకత చూపించారు. గత 12 సంవత్సరాలుగా ఒక మహాయజ్ఞంలా సాగుతున్న ఈ వచన మాహాభారత రచనని 9 సంపుటాలుగా ప్రచురించారు. శైలి పూర్తిగా వాడుక భాషలో సాగింది. మహాభారతం ఒక సముద్రం లాంటిది. వెదికితే ఎన్నో రత్నాలు దొరుకుతాయి. ఈ గ్రంథరచయిత బాలగంగాధరరావు గారు కూడా తమదైన వ్యాఖ్యానాలతో, తమదైన కోణంలో విశ్లేషిస్తూ భారతంలోని సంఘటనలకి ఒక విశిష్టమైన రూపాన్ని ఇచ్చారు. మహాభారతాన్ని పుష్పక విమానంతోనూ, అక్షయపాత్రతోనూ పోలుస్తారు. అందుకే ఎంతమంది వ్రాసిన చెప్పదగిన కోణం మరొకటి మిగులుతుంది. ఆచార్య యార్లగడ్డ గారు వ్రాసిన ఈ గ్రంథపరంపర కూడ ఇదే విషయాన్ని నిరూపిస్తుంది. ఎంతో ప్రామాణికంగా సాగిన ఈ పుస్తకంలో విచిత్రమైన అంశం - ఇందులో రచయిత వ్యాఖ్యానానికి, మధ్యమధ్యలో పాత్రలు మాట్లాడే సంభాషణలకీ వ్యత్యాసం చూపించే ఇన్వర్టెడ్ కామాలు ఎక్కడా వాడలేదు. దీనితో ఒక్కోసారి ఏ వాక్యాలు రచయిత వ్రాసినవీ, ఏ వాక్యాలు పాత్రలు మాట్లాడినవీ అనే సందేహం వస్తుంది. మరి ఇది ముద్రా రాక్షసమా లేక కావాలనే అలా వ్రాశారా అనే సందేహం పాఠకులకి వచ్చినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. సాధారణంగా పాత్రలు మాట్లాడే సంభాషణలని డబుల్ కోట్స్ మధ్యలో చదవడం అలవాటైన పాఠకులకి ఈ పుస్తకంలో వచనం ముద్రితమైన విధానం ఆశ్చర్యం కలిగిస్తుంది. రచయిత తెలుగు ప్రొఫెసర్ గారు కాబట్టి వ్యాఖ్యానాన్ని, సంభాషణలని కలిపి ముద్రించడం వెనుక ఏదో ఉద్దేశం ఉండే ఉండాలి. మహాభారతాన్ని మరో కోణంలో, చక్కని తెలుగుభాషలో చదవాలనుకున్న పాఠకులకి ఈ పుస్తకం ఓ అమూల్యమైన వరం.

★★★




**Available at:**
*Visalandhra Book House – All branches*
*Navodaya Publishers – All Branches*
*Prajashakti Book House – All Branches*

**Writer Email:**
*Anil.s.royal@gmail.com*

**వందేళ్ళపైగా** తెలుగు కథలు వస్తుంటే ఎన్ని కథలు ఎంతమంది మనసుల్లో నిలిచాయి? ఎన్ని కథలు ప్రామాణికంగా పేర్కొనబడుతున్నాయి? ఎంతమంది కథా రచయితలని ఎంతమంది పాఠకులు గుర్తుపెట్టుకున్నారు? - ఇలాంటి ప్రశ్నలకి సమాధానాలు వెదకడం మొదలెడితే ఆసక్తికరమైన విషయాలు బయటపడతాయి. ఏ రచన ఐనా - కథ ఐనా, నవల ఐనా, కవిత ఐనా, వ్యాసం ఐనా - ఎంతకాలం నిలుస్తుంది అనేది.. రచన ఎంతమందికి చేరింది అనే అంశం మీద ఆధారపడి ఉంటుంది. అలానే ఒక రచన అందరికీ నచ్చాలన్న నియమమూ లేదు. ఐతే రచయితలు కనీసం కొన్ని ప్రాథమిక నియమాలు పాటిస్తే తమ రచన ఎక్కువమంది పాఠకులకి చేరే అవకాశం ఉంటుంది. అలాంటి కొన్ని అంశాలని, ముఖ్యంగా కథారచనలో తాను పాటించే కొన్ని సూత్రాలని, ఈ పుస్తకంలో వివరించారు, కథారచయిత అనిల్ ఎస్.రాయల్. అరుదుగా కథలు వ్రాసే అనిల్ గారు కొద్దికథలే వ్రాసినా అతికొద్ది కాలంలోనే మంచిరచయితగా ప్రముఖుల ప్రశంసలనందుకున్నారు. తనదైన పంథాలో ఎక్కువగా సైన్సు ఫిక్షన్ కథలు వ్రాసే అనిల్ గారు, తాను కథలు వ్రాయడంలో తీసుకునే జాగ్రత్తలని పదిమందికీ చేర్చాలన్న ఉద్దేశంతో ఈ వ్యాసాలని వ్రాశారు. ‘ఇవే నియమాలు , ఇవే సూత్రాలు ‘ అని రచయిత ఎక్కడా చెప్పలేదు. ‘నేనిలా వ్రాస్తాను, కథలు వ్రాసే క్రమంలో నేను నేర్చుకున్న విషయాలివీ.. మీకు నచ్చితే తీసుకోండి‘ అని మాత్రమే చెప్పారు. ఇలాంటి విషయాలని ఆసక్తికరంగా చెప్పడం కాస్త కష్టమే. ఐనా అనిల్ ఎస్.రాయల్ తన ప్రయత్నంలో పూర్తిగా కృతకృత్యులయ్యారని చెప్పవచ్చు. తాను చెబుతున్న ప్రతి అంశానికీ చక్కటి ఉదాహరణని జోడించి ఈ వ్యాసాలని అత్యంత ఆసక్తికరంగా తీర్చిదిద్దారు. కేవలం కొత్తరచయితలకే కాక ఇప్పటికే కథలు వ్రాస్తున్న రచయితలకి కూడా ఈ పుస్తకంలోని కొన్ని విషయాలు పోల్చిచూసుకోడానికి ఉపయోగపడతాయి. ప్రతికథనీ ఒక అందమైన శిల్పంలా మలచాలనే ప్రయత్నంలో తాను పడే తపనని వివరంగా తెలియచేశారు రచయిత. ఏదో వ్రాసేశాం అనుకోకుండా, ప్రతి కథా ఎక్కువమంది పాఠకులకి చేరాలని ఆశించే వాళ్ళంతా తప్పక చదవాల్సిన పుస్తకం ఇది. తమకి నచ్చిన, తాము పాటించదగిన విషయాలున్నాయనుకుంటే స్వీకరించవచ్చు. ఈ పుస్తకంలోని ప్రతి వ్యాసం వెనుకా ఎంతో ఆలోచన, విశ్లేషణ, అధ్యయనం.. కనిపిస్తాయి. ఇలాంటి విషయాలని సరళంగా, సులువుగా వివరించిన అనిల్ ఎస్.రాయల్ అభినందనీయులు.

★★★




**ప్రచురణ**

ఉషశ్రీ మిషన్

రేడియో ఆర్టిస్ట్స్ కాలనీ

విజయవాడ - 520 008

**రామాయణ, భారత, మహాభాగవతాలు...** తెలుగు సంస్కృతిలో అవిభాజ్యంగా కలిసిపోయాయి. ఈ ఇతిహాసాలని భక్తిభావంతో పరాయణం చేసేవారు, దైవగ్రంథాలుగా పరిగణించేవారే ఎక్కువగా ఉన్నారు. కొద్దిమంది మాత్రం ఈ మహాగ్రంథాలలోని పాత్రలని, సన్నివేశాలని సానుకూల దృక్పథంతో విశ్లేషించారు. ఏపాత్ర వ్యక్తిత్వం ఎలాంటిది, ఏ సన్నివేశంలో ఈ పాత్ర ఎలా మాట్లాడ్డం వల్ల ఎలాంటి పరిణామాలు సంభవించాయి, ఏ సన్నివేశంనుంచి ఎలాంటి పాఠాలు లేదా గుణపాఠాలు నేర్చుకోవచ్చు - లాంటి విషయాలని విశదీకరించిన కొద్దిమందిలో ప్రముఖంగా చెప్పుకోవాల్సిన పండితుడు డా.ఉషశ్రీ గారు. 1960 - 70 ప్రాంతాల్లో రేడియోలో ధర్మసందేహాలు కార్యక్రమంద్వారా అనేక సంవత్సరాలపాటు ఈ ఇతి హాసాల్లోని ధర్మసూక్ష్మాలని తెలుగువారికి అందించారు. వీరువ్రాసిన పుస్తకం 'ఎవరితో ఎలా మాట్లాడాలి?' ఇప్పటికే ప్రచురితమైంది. ఆ పుస్తకంలో, రామాయణంలోని హనుమంతుడి పాత్ర విశ్లేషణ ద్వారా ఎవరితో ఎప్పుడు ఎలా మాట్లాడాలి అనే విషయాన్ని వాల్మీకి ఎలా చెప్పాడో సోదాహరణంగా వివరించారు. ఇప్పుడు ప్రచురితమైన ఈ 'ఎవరు ఎలా మాట్లాడుతారు?' అనే పుస్తకంలో భారతంలోని రాయబారుల ప్రవర్తనలని, సంభాషణా చతురతని విశ్లేషించారు. ద్రుపదపురోహితుడు, సంజయుడు, శ్రీకృష్ణుడు.. వివిధ సందర్భాల్లో రాయబారులుగా ప్రత్యర్థుల వద్దకి వెళ్ళిన వాళ్ళే. ఒక వర్గాన్నికి ప్రతినిధిగా వ్యతిరేక వర్గం వాళ్ళ వద్దకి వెళ్ళి సంభాషించడం అంటే అది ఒక కళ. ఏం మాట్లాడాలి, ఎలా మాట్లాడాలి, ఎదుటివారి భావోద్వేగాలకి ఎలా స్పందించాలి, ఏ సందర్భంలో ఎలా సమ్యమనం వహించాలి, ఎక్కడ ఆవేశాన్ని అదుపులో పెట్టుకోవాలి - లాంటి విషయాలు ఈ రాయబారుల పాత్రద్వారా వ్యాసమహర్షి వివరించారు. మమూలుగా మహాభారతాన్ని చదివితే ఈ ధర్మసూక్ష్మాలు అందరికీ అర్థంకాకపోవచ్చు. ఉపరితలాన్ని ఛేదించుకుని లోపలికి వెళితే ఎన్నో విలువైన మాణిక్యాలు దొరుకుతాయి. రేడియో వ్యాసుడు ఉషశ్రీగారు చేసిన పని ఇదే. ఇలాంటి పుస్తకాలు ఈ నాటి తరానికి చాలా అవసరం. శతాబ్దాల క్రిందటే అద్భుతమైన వ్యక్తిత్వ వికాసగ్రంథంగా మహాభారతాన్ని తీర్చిదిద్దిన వ్యాసమహర్షి రచనలని అత్యంత సులువైన రీతిలో తెలుగువారికి అందించిన ఉషశ్రీగారి సేవ వెలకట్టలేనిది. వారి పుస్తకాలని మరుగున పడిపోకుండా ఈ తరానికి అందిస్తున్న ఉషశ్రీ మిషన్ వారు , ముఖ్యంగా వారి కుమార్తె డా.గాయత్రిగారు అభినందనీయులు.

★★★




**Available at:**
*Visalandhra Book House – All branches*
*Navodaya Publishers – All Branches*
*Prajashakti Book House – All Branches*

**Writer Email:**
*Anil.s.royal@gmail.com*

**తెలుగుకథ** రచనా రంగంలో తలెత్తిన కొత్త కెరటం అనిల్.ఎస్.రాయల్. అరుదుగా వ్రాస్తున్నా అరుదైన కథల్ని వ్రాస్తున్న అనిల్.ఎస్.రాయల్ ఎంచుకున్న కథా రచనా ప్రక్రియ చాల విలక్షణమైనదీ, అతి తక్కువమంది మాత్రమే వ్రాయడానికి సాహసించినదీ. అదే సైన్స్ ఫిక్షన్. సైన్స్ ఫిక్షన్ అంటే - కథ అనే ప్రక్రియని ఊతంగా చేసుకుని శాస్త్రవిజ్ఞాన విషయాలనన్నింటినీ వ్యాసాల్లా వ్రాయడం కాదు. అనిల్ ఈ రంగంలో చేసిన, చేస్తున్న కృషి, ప్రయోగం చాలా విశిష్టమైనది. ఒక సైన్సు విషయాన్ని తీసుకుని అసలు సిసలైన ఫిక్షన్ కథగా మలిచే క్రమంలో - అద్భుతమైన సన్నివేశాలని అల్లుకుంటూ, పాఠకుడిలో ప్రతి వాక్యానికీ ఉత్కంఠ రేకెత్తించే విధంగా కథని నడపడం అనిల్ ప్రత్యేకత. అవసరమైన చోట, అవసరమైనంత మేరకు క్లిష్టమైన సైన్సు అంశాలని ఆ రంగంతో ఏ మాత్రం పరిచయం లేని వాళ్ళకి కూడా ఆసక్తి కలిగించే విధంగా వ్రాయడం అనిల్‌గారి శైలిలోని విలక్షణత. ఈ కథలు అలవోకగా వ్రాసినట్లు ఉండవు. ప్రతి పదాన్నీ, వాక్యాన్నీ, సన్నివేశాన్నీ ఎంతో ఆలోచనతో వ్రాసి, మొత్తం మీద, ప్రతి కథా ఒక అందమైన, అర్థవంతమైన శిల్పం చెక్కినట్లు ఉంటుంది. అంత లోతైన ఆలోచనతో కూడిన కథలు కావడం వల్లనేమో రచయిత వ్రాసిన కథలు సంఖ్యాపరంగా తక్కువే ఐనప్పటికీ ( సుమారుగా ఆరేళ్ళలో 10 కథలు) - ప్రతి కథా పలు పత్రికల్లో ప్రచురితం కావడం, ప్రతిష్టాత్మకమైన సంకలనాల్లో చోటుచేసుకోవడం ఈ కథలకున్న ప్రత్యేక గుర్తింపుని సూచిస్తుంది. మొట్టమొదటి కథ 'నాగరికథ' ( నాగరికత - కాదు). పేరులో ఉన్న కొత్తదనం కథలోనూ, కథనంలోనూ కూడా ప్రతిబింబిస్తుంది. కథ మొత్తం చదవడం పూర్తిచేశాక, మళ్ళీ వెనక్కు తిరిగి ఒక్కో వాక్యాన్నీ లోతుగా విశ్లేషించుకుంటూ చదవాలనిపిస్తుంది. రచయిత చెప్పిన కాలయంత్ర తర్కం ఆలోచనలో పడేస్తుంది. తను చెప్పిన లాజిక్‌ని విశ్లేషించడంలో పాఠకులని కూడా భాగస్వాముల్ని చేయడంలోనే రచయితగా అనిల్ విజయం కనిపిస్తుంది. ప్రతి కథలోనూ ముఖ్యంగా చెప్పుకోవాల్సిన విషయం - ముగింపు. ఊహించని ముగింపు, కొసమెరుపు ముగింపు ఈ కథల ప్రత్యేకత. అనుకోని మలుపులు కూడా ఈ కథలని ఆసక్తికరంగా చదివింపచేస్తాయి. ముందు మాట వ్రాసిన డా. వేమూరి వేంకటేశ్వరరావుగారు అభిలషించినట్లు - తెలుగు కథా ప్రపంచంలోని రాజబాట మీదకి వైజ్ఞానిక కల్పనలని నడిపించడాన్ని రచయిత అనిల్ కొనసాగించి, తెలుగు కథా ప్రియులకి సరికొత్త అనుభూతుల్ని అందించే ఇలాంటి కథలు మరిన్ని వ్రాసారని ఆశిదాం. ★★★




**ఒక ఉపాధ్యాయుడు** వ్రాసిన 'మాస్టారి కథనికలు' తెలుగు కథా సాహిత్యంలో సరికొత్త ప్రయోగం అని చెప్పుకోవచ్చు. ఇందులోని కథలన్నీ ఉపాధ్యాయ వృత్తి నేపథ్యంలో కొనసాగుతాయి. ఒక మనిషి ఎదుగుదలలో ఉపాధ్యాయుడి పాత్ర ఎంతో కీలకమైనది. గురువు అన్నవాడు వేలాది మంది విద్యార్థులని ప్రభావితం చేసే తన పాఠాలతో కొన్నితరాలకి మంచి గుణాలనీ అందించగలడు, అదే అదుపుతప్పిన ఆలోచనలుంటే కొన్ని తరాలనీ పాడుచేయగలడు. 25-30 సంవత్సరాల వృత్తిజీవితంలో ఒక ఉపాధ్యాయుడు వేలాది మంది విద్యార్థినీ, విద్యార్థులతో సన్నిహితంగా సంభాషించే అవకాశం లభిస్తుంది. ఆ క్రమంలో తన దగ్గర చదువుకునే పిల్లలతోనే కాక వారి తల్లిదండ్రులతో, ఎప్పుడో చదువుకున్న పూర్వ విద్యార్థులతో, తోటి టీచర్లతో .. ఎన్నో అనుభవాలు, జ్ఞాపకాలు ఏర్పడతాయి. వాటిలోంచి పాఠాలు, గుణపాఠాలు అనదగిన కొన్ని అనుభవాలకి కథా రూపం వస్తే - ఇదిగో ఈ పుస్తకంలోని కథలుగా రూపుదిద్దుకుంటాయి. రచయిత ఉదయబాబుగారు ఈ కథలని వ్రాయడంలో చేసిన కృషి ఎంతో ప్రశంసనీయం. తీసుకున్న అంశాన్ని బట్టి ప్రతి కథలోనూ ఏదో ఒక సందేశం తప్పని సరిగా ఉంటుంది. 'గురువు' అన్న వృత్తిలో ఉన్న మహత్యమే అది. ఎలాంటి సందేశాన్నయినా చాలా సరళంగా కథలో ఒదిగిపోయేలా చిత్రించి ప్రతి కథకీ చక్కటి ముగింపునిచ్చారు రచయిత. సన్నివేశపరంగా అక్కడక్కడా ఉపన్యాసాల్లాంటి సుదీర్ఘ సంభాషణలున్నా, కథ శిల్పానికి అడ్డురాకుండా ఈ కథల్ని రచయిత తీర్చి దిద్దిన విధానం అభినందనీయం. తీసుకున్న నేపథ్యాన్ని బట్టి కథాంశాలకి పరిమితి ఉంటుందేమో అనిపిస్తుంది కానీ రచయిత ఎంచుకున్న ఇతివృత్తాల్లో వైవిధ్యం రచయితలోని పరిణితిని తెలియచేస్తుంది. మొట్టమొదటి కథలో అమ్మకు మించిన గురువు మరొకరు లేరు అని చెబుతారు. శ్రీ గురుభ్యోన్నమః అనే కథలో మాస్టారైనా ఒక మనిషే , అతనిలోనూ ఒక వికృతరూపం ఉండవచ్చు అని చిత్రిస్తూ చక్కటి ముగింపునిచ్చారు రచయిత. ఓ నిజాయితీ కథలో - జీవితాంతం నిజాయితీనే నమ్ముకున్న మాస్టారికి ఎదురైన అనుభవం , దాని పర్యవసానం పాఠకుల మనసుల్ని కదిలిస్తుంది. ఈ పుస్తకంలోని ప్రతి కథా ఒక టీచర్‌కి, ఒక విద్యార్థికి, తల్లిదండ్రులకీ అందరికీ వర్తిస్తుంది. అందరి కోణాలనీ ఆవిష్కరిస్తుంది.

****

*ప్రచురణ*

శ్రీవేదగిరి కమ్యూనికేషన్స్

హెచ్.ఐ.జి-1 , బ్లాక్ - 6, ఫ్లాట్ - 10,

బాగ్ లింగంపల్లి ; హైదరాబాద్ - 500 044

**రచయిత సెల్:** 94418 60161




MV Ramireddy
98667 77870
muvvaramu@gmail.com

**For Copies :**
M. Rajyalakshmi
102, Sri Kota Residency,
Near old Police Station,
Miyapur, Hyderabad - 49

**కవిత్వం అందంగా ఉంటుంది** - అలరిస్తుంది; కవిత్వం వాస్తవంగా ఉంటుంది - ప్రశ్నిస్తుంది; కవిత్వం కారణాలు వెదుకుతుంది - విశ్లేషిస్తుంది; కవిత్వం కరుణ నింపుకుంటుంది - కళ్ళు తడిచేస్తుంది; కవిత్వం మనిషి తనాన్ని నింపుకుంటుంది - నిలువెల్లా ఆవరిస్తుంది; - ఎమ్వీ.రామిరెడ్డి గారి కవిత్వంలో ఇవన్నీ ఉన్నాయి. వ్రాసిన ప్రతి వాక్యానికీ ఒక అర్థం, సార్థకత , సామాజిక ప్రయోజనం ఉండాలని ఆశించి, ఆచరించి నిలుపుకుంటూ వస్తున్న కవి, రచయిత, నిస్వార్థ సామాజిక సేవాకార్యకర్త ఈ రచయిత. వాస్తవాన్ని విశ్లేషిస్తూ వ్రాసే కవితలు, సామాజిక సమస్యల గురించి వ్రాసే కవితలు, కాస్త జాగ్రత్త వహించకపోతే కేవలం వ్యాసాల్లానో, నినాదాల్లానో రూపుదిద్దుకునే అవకాశం ఉంది. అలాంటి ఛాయలైనా కనిపించకుండా, ఎంచుకున్న కవితా వస్తువు, తీసుకున్న సమస్య ఏదైనా, కవితాత్మ ఏమాత్రం లోపించకుండా ప్రతి కవితనీ తీర్చిదిద్దారు రచయిత. అసలు సిసలైన కవితాధారని కొనసాగిస్తూనే విశ్లేషణని, ముగింపునీ కూడా అత్యంత బలీయంగా పాఠకుడి మనసులోకి తర్జుమా చేయగల నేర్పు రామిరెడ్డిగారి కవిత్వం యొక్క ప్రత్యేకత. రాజధాని పేరుతో పచ్చదనం మాయమౌతున్న వైనం, టివిల్లో చిన్నపిల్లల డాన్సులు, ధ్యేయం మార్చుకున్న విద్యావిధానం.. లాంటి తీవ్రమైన సమస్యలేకాక, రోజంతా అలసిపోయి ఇంటికొచ్చినప్పటి భావన, పాతమాస్టారిని కలుసుకోవడం లాంటి అతి మామూలు సన్నివేశాలు కూడా ఈ కవికి కవితా వస్తువులయ్యాయి. ఇందులోని ప్రతి కవితలోనూ కవి నిజాయితీ ప్రతిఫలిస్తుంది. ప్రతి కవితా ఆలోచనలు రేకెత్తిస్తుంది, మనసుని కదిలిస్తుంది. చాలా కవితల్లో ముగింపులో వ్రాసిన వాక్యాలు పదేపదే మననం చేసుకోవాల్సిన నిజాలుగా అస్తిత్వాన్ని నిలబెట్టుకుంటాయి. "ఒక మనిషిని నువ్వు చేరుకోవడమంటే / అతను - ఆమె నీలోకి నువ్వు వారిలోకీ / పిలుపు మాత్రంగా ప్రయాణించడం / ఆ పిలుపు ప్రాతఃస్మరణీయం కావాలి / ఆ ప్రయాణం పరిమళభరితం కావాలి..!" ; "ఒక నిర్మాణం కోసం / సామూహిక జీవనసూత్రం ధ్వంసం కావడం / వ్యవస్థీకృత విషాదం / మనిషినీ మనిషినీ కలిపి ఉంచే / మమతల రాజధానిని కూల్చివేయడం..!" ; "నమ్మకం ఒక నియంత / మనిషి ముందు / మహాపర్వతాలు మోకరిల్లుతాయి / సముద్రవైశాల్యం చిన్నబోతుంది / ఆకాశం ఆత్మీయంగా వంగి సలాం చేస్తుంది..!". ముందుమాటలో పెనుగొండ లక్ష్మీనారాయణగారు వ్రాసినట్లు "జీవిత భాష్యం రామిరెడ్డి సాహిత్యం - జీవన సౌందర్యం రామిరెడ్డి సాహిత్య తాత్వికత..!!"

****




**© Poet**
konakanchilnrao@gmail.com
Ph : 9441001918
www.konakanchi.com

**Published by**
Topudu Bandi Publications
1-9-286/2, Near Bus Stop,
Raam Nagar Gundu, Hyderabad-44
Ph : 7386868267

**విచ్చుకత్తులాంటి భావాలు,** పెనుమంటల్లాంటి పదాలు ..కొనకంచిగారి కవితాశైలి. ఈ భావాలు మనిషి మనసులోని జడత్వాన్ని ఖండఖండాలుగా చీల్చిచెండాడుతాయి. ఈ పదాలు మొహమాటాన్ని, నాన్చుడు తనాన్ని దహిస్తాయి. సూటిగా, ఘాటుగా, వాడిగా, వేడిగా సాగే కొనకంచిగారి కవితలు పాఠకులని నిలదీసిప్రశ్నిస్తాయి, ప్రశ్నించలేని బద్ధకాన్ని సమూలంగా నిర్మూలిస్తాయి. తెలుగుకవితా ప్రపంచంలో తనదైన సొంతగొంతు, సొంతసంతకం ఉన్న కవి కొనకంచి. స్నేహమైనా, విరహమైనా, జీవనమైనా, మరణమైనా, చీకటిలో జరిగే దురాగతాలు, పట్టపగలు చెలరేగే దారుణాలు.. ఏవైనా కొనకంచి కలంలోంచి సరికొత్త కవితారూపాన్ని సంతరించుకుని కళ్ళముందు నిలుస్తాయి.. ఘర్షణకి వెనకాడవద్దని చెబుతాయి, నగ్నంగా ఆలోచించమని పదేపదే నినదిస్తాయి.

"ప్రజల జీవితాలన్నీ రెండు ఉదయాల మధ్య / మండిపోయి బూడిదగా మిగిలిపోతున్నప్పుడు / సర్వనాశనమై పోయిన వ్యవస్థలో / అక్షరాల మధ్య మనిషిగా నా అస్థిత్వ సంక్షోభమే .. నాకవిత్వం" అని ప్రారంభంలో ప్రకటించిన కవి కొనకంచిగారు తన భావాలని, ప్రతి కవితలోనూ, ప్రతి పంక్తిలోనూ, ప్రతి పదంలోనూ, నిజాయితీగా నిర్భయంగా వెలిబుచ్చారు..! అన్నికోణాల్లోనూ, అన్ని రంగాల్లోనూ విధ్వంసవిలువలని పెంచిపోషిస్తున్న సమకాలీన సమాజంలోని వికృతరూపాలపై ఎక్కుపెట్టిన పదాలబందూకులు ఇవిగో.. " చుట్టూ ఉన్న ప్రపంచంలో / మనుషులంతా నడిచే నల్లనాగులుగా మారినప్పుడు / గుడ్డు గుడ్డులాగే ఉంటుంది / గుడ్డులో పచ్చసొన మాయమవుతుంది/ మనిషి మనిషిలాగే ఉంటాడు / మనిషిలో మనిషి మాయమవుతాడు / ; సర్వం నాశనమయిన చోట / బూడిద కుప్పలమధ్య / కుళ్ళిన దుర్గంధంలో / రేపటి కొత్తసమరాల్లో మీరంతా పాడే / ఈ జాతి ఆఖరి పోరాటగ్రంథమే ఒక యంత్రలిపి; ఈ దేశంలో ప్రజలంతా బిచ్చగాళ్ళవుతున్నప్పుడు / ప్రజలంతా కేజీ రూపాయి / బియ్యాలయి పోతున్నప్పుడు / కాలాన్ని ఎదిరించడానికి / సరికొత్త నేల సుగంధాన్ని నిర్మించడానికి / అక్షరాలుగా మారిన కత్తులకర్మాగారం / మంత్రించిన మంటల గండభేరుండం ఈ 'మంత్రలిపి' ". 'మరణానికి ముందు ఎవరైనా' అనే కవితలో అంటారు కవి " మంచంలో పడ్డాక / జీవితంలో నువ్వు తెలుసుకున్న ఆఖరి జ్ఞానాన్ని పక్కవాళ్ళకు చెప్పాలనిపిస్తుంది/ కానీ మాటలు రావు / చెప్పాలనుకున్న మాటలన్నీ కన్నీళ్ళరూపంలో బయటి కొస్తుంటాయి". తలిదండ్రుల్ని నిర్లక్ష్యంచేసే తరంపై ఎక్కుపెట్టిన అస్త్రం "ఒరేయ్ కొడుకా .. నువ్విలా అయిపోయావేంటి". ఈ కవితలని మరింతలోతుగా పరిచయం చెయ్యాలంటే మళ్ళీ ఈ పుస్తకమంత పుస్తకం రాయాల్సిందే. మహాప్రస్థానానికి చలం వ్రాసిన పీఠికలోని అనేక భావాలు ఈ 'మంత్రలిపి'కి నూటికి నూరుశాతం వర్తిస్తాయి. పాఠకులని వారికి వారినే కొత్తగా పరిచయం చేయడమనేది ఈ 'మంత్రలిపి' కర్త కొనకంచిగారికి మాత్రమే సాధ్యపడింది..!!!

***